TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ

ఎడిటర్ పి. రాజేష్ తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam సంపుటి : 2 సంచిక : 75 పేజీలు : 8 బుధవారం 14 ఆగస్టు 2024 వెల : 4/-



## హరీశ్ రావు వ్యాఖ్యలు బాధించాయి

- కన్నీటి పర్యంతమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- తాను ఎప్పుడూ క్రెడిట్ కోసం పాకులాడలేదన్న తుమ్మల నాగేశ్వరరావు
- ప్రచారం కోసమే బటన్ నొక్కే పనులు చేయలేదని వ్యాఖ్య
- అవమానించిన వారికి కూడా నేనేంటో తెలుసునన్న తుమ్మల

హైదరాబాద్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యలు తనను బాధించాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తాను ప్రచారం కోసమే బటన్ నొక్కే పనులు ఎప్పుడూ చేయలేదన్నారు. ఎప్పుడూ క్రెడిట్ కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. ఎకరం పొలం కూడా తనకు సీతారామ ప్రాజెక్టు కింద లేదన్నారు. హరీశ్ రావు అంటే తనకు ఇష్టమని, ఆయన మాట్లాడే సబ్జెక్ట్, ఆయనకు ఉన్న అవగాహన తనకు ఎంతో నచ్చుతాయని వ్యాఖ్యానించారు. కానీ అలాంటి - మిగతా3లో

# స్ట్రాంగ్ టీమ్ ఏర్పాటులో రేవంత్



రాజకీయాల్లో అనుభవం ముఖ్యం కాదు. అప్పటికప్పుడు అనువైన నిర్ణయాలు తీసుకోవడమే రాజకీయాల్లో రాణిస్తారు. గతంలో మంత్రి పదవి కూడా దక్కని రేవంత్ రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి పదవి దక్కించుకున్నారు. ఇది ఆయన వద్దకు చేరిన పదవి కాదు. శ్రమించి.. చెమటోడ్చి తన వద్దకే పదవిని రప్పించుకున్నారు. ఉద్దండులను, సీనియర్ నేతలను తోసిరాజని ఆయన పదవి తెచ్చుకోవడం ఆషామాషీ కాదు. ఎందుకంటే అది కాంగ్రెస్ పార్టీ. ఒకరు ముందుకు నెడితే.... నలుగురు వెనక్కు లాగుతారు. అలాంటి కాంగ్రెస్ ను తన నాయకత్వంలో అధికారంలోకి తేవడం నిజంగా రేవంత్ రెడ్డి లక్కు అనే చెప్పాలి.



## వైద్యురాలిపై హత్యాచారం కేసు సీబీఐకి అప్పగింత

- 3 వారాల్లోగా నివేదిక ఇవ్వాలంటూ హైకోర్టు ఆదేశం
- గత ఐదు రోజులుగా దేశవ్యాప్తంగా విధులను బహిష్కరించి నిరసన
- ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం
- ఐదు రోజులైనా పోలీసుల దర్యాప్తులో పురోగతి లేదు

# రాజ్యసభకు పెరుగుతున్న ఆశవహులు

- కె.కేశవరావు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడంతో ఈ ఎన్నిక
- కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభ స్థానం దక్కుతుంది
- బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్ కే రాజ్యసభ పదవి
- పార్టీ జెండాను వదలకుండా అధికారంలోకి వచ్చినా, రాకపోయినా పార్టీని బలోపేతం చేయడం కోసం చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నాలు



హైదరాబాద్

రాజ్యసభ ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభ స్థానం దక్కుతుంది. బలాబలాలను పరిశీలిస్తే కాంగ్రెస్ కే రాజ్యసభ పదవి దక్కుతుంది. కె.కేశవరావు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరడంతో ఈ ఎన్నిక జరుగుతుంది. కేకే రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేశారు. దీంతో ఈ పోస్టుకు ఎన్నిక జరుగుతుంది. పదేళ్ల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశావహుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. రాజ్యసభ స్థానం దక్కించుకోవడానికి అనేక మంది పోటీ - మిగతా3లో

## రుణమాఫీ, రైతుబంధుపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా?

- రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు వారి తరఫున బీజేపీ పోరాటం చేస్తుందన్న ఎంపీ
- తెలంగాణలో 30 లక్షల మందికి రుణమాఫీ జరగలేదని విమర్శ
- రైతులకు ప్రధానంగా నాలుగు హామీలు ఇచ్చారన్న ఈటల రాజేందర్


హైదరాబాద్

రుణమాఫీ, రైతుబంధుపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా? అని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు వారి తరఫున బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఎన్నో హామీలతో పాటు రైతులకు ఇచ్చిన హామీల విషయంలోనూ ప్రభుత్వం - మిగతా3లో




# స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

- కొరత ఉన్న చోట్ల తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం
- 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోనే ఎంపిక
- 52 పాఠశాలల్లో 54 మంది ఎంపికకు అనుమతి
- బడుల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు




వికారాబాద్

ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చింది. వికారాబాద్ జిల్లాలో మొదట 85 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు అవసరమవుతారని గుర్తించగా, ఇప్పటి వరకు 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోని 52పాఠశాలల్లో 54మంది నియామకానికి అనుమతిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకాగా, గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొత్తవారు జాయిన్ అయ్యే - మిగతా3లో



## వక్ఫ్ సవరణ బిల్లు.. జాయింట్ కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్

- వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది.
- లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులకు అవకాశం

## తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేసిన ఏపీ సర్కారు

**రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులను తిరిగి వారి స్వరాష్ట్రానికి పంపేలా ఉత్తర్వులు**

తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను ఏపీ ప్రభుత్వం మంగళవారం రిలీవ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులను తిరిగి వారి స్వరాష్ట్రానికి పంపేలా ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 122 మంది తెలంగాణా స్థానికత కలిగిన నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తెలంగాణా ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను తెలంగాణకు రిలీవ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను రిలీవ్ చేసే ముందు వారి నుంచి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేసింది. తెలంగాణకు రిలీవ్ అవుతున్న ఉద్యోగులు తమ కేడర్‌లోని చివరి ర్యాంక్‌లో మాత్రమే చేరుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# నిరసన కారులను పొగిడేసిన యూనస్



**ఢాకా :** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత ముహమ్మద్ యూనస్ మరోసారి మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో రాక్షస పాలన అంతం అయ్యిందంటూ కామెంట్ చేశారు. అలాగే, షేక్ హసీనా రాజీనామా చేసి, దేశం విడిచి పారిపోవడానికి కారణమైన నిరసనకారులు, విద్యార్థులను ముహమ్మద్ యూనస్ అభినందించారు. విద్యార్థులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల నేతృత్వంలోని విప్లవం మొత్తం ప్రభుత్వాన్ని కూల్చివేసిందన్నారు. విద్యార్థులను గౌరవిస్తాను, ఆరాధిస్తాను. వారు సాధించినది నిజంగా సాటిలేనిదని కొనియాడారు. తాత్కాలిక పరిపాలన బాధ్యతలు స్వీకరించమని కోరినందున, అంగీకరిస్తున్నానని ముహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. దేశంలో రాక్షస పాలన పోయిందని, ప్రతిపక్షాలు అన్ని ఏకమై నిరంకుశ పాలనకు ముగింపు పలికారన్నారు. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఏకంగా ప్రధానమంత్రి నివాసాన్నే ముట్టడించారు. షేక్ హసీనాను రాజీనామా చేసి, దేశం విడిచి వెళ్లాలంటూ విద్యార్థి నాయకులు అల్టిమేటం జారీ చేశారు. ఆ తర్వాత, బహిష్కరించిన ప్రధాన మంత్రి షేక్ హసీనాకు సన్నిహితంగా ఉన్న ఉన్నత స్థాయి అధికారుల చేత సైతం, ప్రధాన న్యాయమూర్తి ఒబైదుల్ హసన్ చేత రాజీనామాలు చేయించారు. ఈ నేపథ్యంలోనే చట్టబద్ధమైన పాలన సాగించేందుకు కృషీ చేస్తానని యూనస్ తెలిపారు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడమే తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఆయన అన్నారు. మరోవైపు సయ్యద్ రెఫాత్ అహ్మద్ పేరును నిరసనల విద్యార్థి నాయకులు ప్రతిపాదించడంతో బంగ్లాదేశ్ కొత్త ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇదిలావుండగా, బంగ్లాదేశ్‌లో వారంరోజుల హింసలో విద్యార్థులు, పోలీసు అధికారులు సహా 300 మందికి పైగా చనిపోయారు. నోబెల్ బహుమతి గ్రహీత అయిన ముహమ్మద్ యూనస్ 2008లో హసీనాతో ఇబ్బందుల్లో పడ్డారు. ఆమె పరిపాలన అతనిపై అతని గ్రామీణ బ్యాంకుపై వరుస విచారణలు ప్రారంభించింది. అతని నోబెల్ బహుమతి, ఒక పుస్తకం నుండి రాయల్టీలతో సహా ప్రభుత్వ అనుమతి లేకుండా డబ్బు అందుకున్న ఆరోపణలపై 2013లో ఆయనపై విచారణ జరిగింది. అయితే యూనస్ ఈ ఆరోపణలను ఖండించారు. అతని మద్దతుదారులు హసీనాతో అతని అతిశీతలమైన సంబంధాల కారణంగా అతన్ని లక్ష్యంగా చేసుకున్నారని బంగ్లాదేశీలు భావిస్తున్నారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలో కొత్త సర్కార్ ఏర్పాటైనప్పటికి ఢాకాతో సహా పలు నగరాల్లో హిందువుల ఇళ్లపై దాడులు యధేచ్చగా కొనసాగుతున్నాయి. ఆలయాలను కూడా అల్లరిమూకలు టార్గెట్ చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. హిందువులకు తగిన రక్షణ కల్పించాలని కేంద్రం మరోసారి బంగ్లా ప్రభుత్వాన్ని కోరింది. వైమానిక స్థావరం ఏర్పాటుకు సెయింటు మార్టిన్ ద్వీపాన్ని ఇవ్వన్నందుకే బంగ్లాదేశ్‌లో అమెరికా తన ప్రభుత్వాన్ని కూల్చిందని మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు.

# సునీతా విలియమ్స్ పరిస్థితి ఏంటీ

**న్యూయార్క్ :** జూన్ 5న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లారు సునీతా విలియమ్స్, బారీ విల్మోర్. వారు ఎనిమిది రోజుల తర్వాత జూన్ పదమూడో తేదీ తర్వాత మళ్లీ కిందకు రావాల్సి ఉంది. కానీ ఆగస్టు దాటుతున్నా వారిని కిందకు తీసుకు వచ్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి . స్పేస్ షటిల్ విఫలం కావడంతో వారిద్దరూ అంతరిక్షంలోనే ఉండిపోయారు. ఇప్పుడు వ్యోమనౌకకు రిపేర్ చేసేందుకు ఎనిమిది నెలల వరకూ సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో వచ్చే ఏడాది మాత్రమే.. వారు కిందకు రాగలరని నాసా అంచనా వేసింది. సునీతా విలియమ్స్, బారీ విల్మోర్ బోయింగ్ కంపెనీ తయారు చేసిన స్టార్‌లైనర్ అనే స్పేస్ షటిల్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. నిజానికి ఇది నాసా రెగ్యులర్‌గా యాత్రికులను తీసుకెళ్లే వ్యోమనౌక కాదు. ప్రయాణికులను తీసుకెళ్లేందుకు తయారు చేసిన మొదటి వ్యోమనౌక. దీన్ని పరీక్షించేందుకు సునీతా విలియమ్స్, బారీ విల్మర్ ను అందులో మొదటగా ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు పంపారు. కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వారు సురక్షితంగానే ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కానీ మళ్లీ వారు భూమికి తిరిగి రావడానికి స్టార్‌లైనర్ స్పేస్ షిప్‌లో చాలా సమస్యలు ఏర్పడ్డాయి. స్టార్ లైనర్ అంతరిక్షనౌకలోనే తిరిగి భూమికి తీసుకురావడానికి నాసా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే అది సాధ్యం కాకపోతే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తామని నాసా అధికారులు ప్రకటించారు. ఒకే వేళ స్టార్ లైనర్ సిద్ధం కాకపోతే.. సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయంగా మరో స్పేస్ షటిల్ ను ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దాన్ని తిరిగి ఫిబ్రవరిలో భూమి మీదకు ల్యాండయ్యేలా చేయనున్నారు. అయితే స్టార్ లైనర్‌లోనే వారిని మళ్లీ కిందకు తీసుకు రావాలని అనుకుంటున్నారు. సునీతా విలియమ్స్ తో పాటు విల్మోర్ కనీస అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహార పదార్థాలు, ఇతర వస్తువులతో స్పేస్‌ఎక్స్ రాకెట్‌ను ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్ కు పంపించారు. సునీత విలియమ్స్ ఇప్పటికీ మూడు సార్లు అంతరిక్షంలోకి వెళ్లారు. ఇలా అంతరిక్షంలో ఇరుక్కుపోవడంపై వారు ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయడం లేదు.



# బెయిల్‌ను తిరస్కరించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే..!




చట్టవ్యతిరేక కార్యకలాపాలు.. తదితర ప్రత్యేక చట్టాల కింద జరిగే నేరాలకు బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానాలు తగిన కేసుల్లోనూ బెయిల్‌ను తిరస్కరించడం ప్రారంభిస్తే అది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం పేర్కొంది. ప్రాసిక్యూషన్ ఆరోపణలు చాలా తీవ్రమైనవి అయినా.. బెయిల్ కేసును చట్టం ప్రకారం పరిగణించడం కోర్టు విధి అని పేర్కొంది. బెయిల్ అనేది నియమమని.. జైలు నుంచి మినహాయింపు అని తెలిపింది. ఇది ప్రత్యేక చట్టాలకు సైతం వర్తిస్తుందని చెప్పింది. న్యాయస్థానాలు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్టేనని ధర్మాసనం అభిప్రాయపడింది. జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తిని బెయిల్‌పై విడుదల చేసేందుకు కోర్టు అంగీకరించింది. జలాలుద్దీన్ ఖాన్‌పై ఉపా యాక్ట్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అతను నిషేధి సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (%ూఖీ×%) సభ్యులకు తన ఇంటిపై అంతస్తును అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు నేరపూరిత కుట్ర, ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు పన్నిన కుట్రలో భాగమయ్యాడని ఎన్ఐఏ ఆరోపించింది. నిందితులు ఫుల్వారీ షరీఫ్ (పాట్నా)లోని అహ్మద్ ప్యాలెస్‌ను అద్దెకు తీసుకొని వసతి ఏర్పాటు చేసుకున్నారని.. భవనాన్ని హింసాత్మక చర్యలకు, సమావేశాలను నిర్వహించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు ఉపయోగించినట్లుగా ఆరోపణలున్నాయి. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ పర్యటన సందర్భంగా అలజడి సృష్టించేందుకు నిందితులు కుట్ర పన్నినట్లుగా బిహార్ పోలీసులకు సమాచారం అందింది. ఆ తర్వాత 11 జులై 2022న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

# త్వరలోనే మంత్రివర్గ విస్తరణ.. ఐదుగురికి ఉద్వాసన?

**బెంగళూరు:** రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలోనే మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేయాలని అధిష్టానం సూచించినట్టు తెలుస్తోంది. ఐదుగురిని కేబినెట్ నుంచి తొలగించి ఆరుగురి ద్వారా భర్తీ చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య(%జష్ట్రఅవట వీఱఅఱర్‌వతీ ాఱఅఎఝతీఝఝఝష్ట్ర%)కు ఆప్తుడిగా ముద్ర పడిన నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, అబ్కారి మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర, సహకారశాఖ మంత్రి రాజణ్ణ, ప్రజా పాలన, హజ్‌శాఖ మంత్రి రహీంఖాన్‌ను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నాగేంద్ర రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉంది. వీటితో కలిపి ఆరు స్థానాలు భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే భద్రావతి ఎమ్మెల్యే సంగమేశ్‌కు కేబినెట్‌లో చోటు ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా భద్రావతిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ జరిగితే సంగమేశ్ మంత్రి అవుతారన్నారు.



## వక్ఫ్ సవరణ బిల్లు.. జాయింట్ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్



పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు-2024పై అధ్యయనానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ని కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మొత్తం 31 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైంది. తాజాగా ఈ కమిటీకి ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024ను కేంద్రం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా మహిళలతోపాటు, ముస్లిమేతరులకు వక్ఫ్‌బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును విపక్ష ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో వెనక్కి తగ్గిన కేంద్రం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే జేపీసీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. జగదాంబికా పాల్ (కమిటీ ఛైర్మన్), నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, దిలీప్ సైకియా, అభిజిత్ గంగోపాధ్యాయ, డీకే అరుణ, గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మొహమ్మద్ జావేద్, మౌలానా మొహిబుల్లా నాద్వి, కళ్యాణ్ బెనర్జీ, ఎ రాజా, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, దిలేశ్వర్ కమైత్, అరవింద్ సావంత్, సురేష్ గోపీనాథ్, నరేష్ గణపత్, అరుణ్ భారతి, అసదుద్దీన్ ఒవైసీ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఇక రాజ్యసభ నుంచి బ్రిజ్ లాల్, మేధా విక్రమ్ కులకర్ణి, గులాం అలీ, రాధా మోహన్ దాస్ అగర్వాల్, సయ్యద్ నజీర్ హుస్సేన్, మొహమ్మద్ నదీముల్ హఖ్, విజయసాయి రెడ్డి, మొహమ్మద్ అబ్దుల్లా, సంజయ్ సింగ్ , ధర్మశాల వీరేంద్ర హెగ్డే ఈ కమిటీకి సభ్యులుగా వ్యవహరించనున్నారు.

## వైద్యురాలిపై హత్యాచారం కేసు సీబీఐకి అప్పగింత




పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆందోళన బాట పట్టారు గత ఐదు రోజులుగా దేశవ్యాప్తంగా విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కతా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను సీబీఐ కి అప్పగించింది. కోర్టు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరగాలని మృతురాలి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఘటన జరిగి ఐదు రోజులైనా పోలీసుల దర్యాప్తులో పురోగతి లేదంటూ మండిపడింది. ఈ మేరకు కేసును సీబీఐకి బదిలీ చేస్తూ హైకోర్టు చీఫ్ జస్టిస్ శివజ్ఞానం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ విచారణ చేపట్టిన రాష్ట్ర పోలీసులు కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను బుధవారం ఉదయం లోగా సీబీఐకి అందజేయాలని ఆదేశించారు. ఈ కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి మూడు వారాల్లోగా నివేదిక ఇవ్వాలి సీబీఐ అధికారులను కోర్టు ఆదేశించింది.

## సెబీ చీఫ్‌ను తొలగించాలి



**న్యూఢిల్లీ:** అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం వేడెక్కుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చీఫ్ మాధబి పూరి బచ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల వద్ద నిరసలకు దిగాలని నిర్ణయించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. "కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులతో ఇవాళ సమావేశం జరిగింది. అదానీ-సెబీకి సంబంధం ఉన్న హిండెన్‌బర్గ్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవడంపై ప్రధానంగా చర్చించాం" అని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కుంభకోణంలో మోదీ ప్రమేయంపై ఆరోపణలు గుప్పిస్తూ, ప్రధానంగా తాము రెండు అంశాలపై దేశవ్యాప్త ఆందోళనలకు నిర్ణయించామని చెప్పారు. ప్రధాన మంత్రి పూర్తి ప్రమేయం ఉన్న అదానీ మెగా స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫైనాన్షియల్ మార్కెట్ రెగ్యులేషన్ విషయంలో పూర్తిగా మోదీ రాజీపడ్డారని ఆరోపించారు. సెబీ బాస్ రాజీనామా చేయాలనేది కూడా తమ మరో డిమాండ్ అని చెప్పారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఆయా నగరాల్లోని ఈడీ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై ఆగస్టు 10న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలున్నాయని ఆరోపించింది. దీనిపై బచ్ ఘాటుగా స్పందించారు. ఇది వ్యక్తిత్వ హననమేనని అన్నారు. అదానీ గ్రూప్ సైతం హిండెన్‌బర్గ్ ఆరోపణలు కొట్టివేసింది. సెబీ ఛైర్‌పర్సన్‌తో కానీ, ఆమె భర్తతో కానీ తమకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపింది.

# స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

-మొదటిపేజీ తరువాయి

వరకు పాత వారిని రిలీవ్ చేయడం లేదు. అయితే తమను బదిలీ చోటుకు పంపాలని ఉపాధ్యాయులు విద్యాశాఖపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో సరిపడినంత మంది ఉపాధ్యాయుల్లేక చదువులు సాగడం లేదు. ఉపాధ్యాయుల నియామకానికి ఇటీవల డీఎస్సీ నిర్వహించగా, సెప్టెంబరు 5న గురుపూజోత్సవం రోజున నియామకపత్రాలివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అప్పటి వరకు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు చేపట్టనున్నారు. వికారాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలోని 52 పాఠశాలల్లో 54 మందిని నియమించేందుకు అనుమతిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి నెలకు రూ.15,600 గౌరవ వేతనం ఇస్తారు. మూడు నెలల కాలానికే అని అపాయింట్‌మెంట్ లెటర్లలో పేర్కొన్నా డీఎస్సీ నియామకాల వరకూ కొనసాగే అవకాశం ఉంది.

**'కడా' పరిధి పాఠశాలల్లోనే..**

కొడంగల్ ఏరియా డెవల్‌పమెంట్ అథారిటీ(కడా) పరిధి బొంరాసపేట్, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ మండలాల్లో టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. బొంరాసపేట్ మండలంలో రేగడి మైలారం, మహంతిపూర్, కొత్తూరు, లగచర్ల, ఎన్కేపల్లిల్లో 10 ఖాళీల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తారు. దౌల్తాబాద్



మండలం తిమ్మారెడ్డిపల్లి, నీటూరు, మాటూరు, దేవరఫస్లాబాద్, దౌల్తాబా ద్, బాలంపేట్, బిచ్చాల్, సుల్తాన్‌పూర్, గుమ్‌డాల్‌ల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 21 పోస్టుల్లో ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. దుద్యాల్, హకీంపేట్, చిల్ముల్ మైల్వార్, దుద్యాల్ ఉర్దూ మీడి యం, ఏర్పుమళ్ల పాఠశాలల్లో 12 మందిని నియమిస్తారు. కొడంగల్ మండలం హస్నాబాద్ ఉర్దూ మీడి యం, అంగడి రాయిచూర్ ఉర్దూ మీడియం, అన్నారం, ఇందనూరు, టేకల్కోడ్, పర్సాపూర్, రుద్రారం, కొడంగల్, కస్తూర్‌పల్లి పాఠశాలల్లో 11 మందిని నియమించనున్నారు.

**కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక**

అకతడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల్లో మొదట పాఠశాల ఉండే గ్రామ పంచాయతీ/మునిసిపల్ పరిధిలో నివాసం ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. పంచాయతీ, మునిసిపాలిటీలో అభ్యర్థులు అందుబాటులో లేకపోతే సమీప పంచాయతీల వారికి ప్రాధాన్యం ఇస్తారు. అక్కడా అర్హులు దొరక్కపోతే మండలంలోని గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి విధులకు హాజరయ్యే అవకాశం ఉంది.

**అర్హులు ఎవరంటే ..**

స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు డిగ్రీ, బీఎడ్ విద్యార్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. అదే తెలుగు, హిందీ, ఉర్దూ పండిత్ పోస్టులకు డిగ్రీతో పాటు పండిత్ శిక్షణ పూర్తయిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఎంపీడీవో అధ్యక్షతన ఎంఈవో, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. నియామక ప్రక్రియను ఈ నెల 15వ తేదీకల్లా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# హరీశ్ రావు వ్యాఖ్యలు బాధించాయి

-మొదటిపేజీ తరువాయి

హరీశ్ రావు తనపట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సీతారామ ప్రాజెక్టు ఘనత కేసీఆర్‌ది అయితే కొంతమంది మంత్రులు తమ ఖాతాలో వేసుకోవడానికి పోటీ పడుతున్నారని నిన్న హరీశ్ రావు విమర్శించారు. ఫ్లెక్సీల నాయకుడని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తాము తప్పు చేసి ఉంటే ప్రజలే బుద్ధి చెబుతారని హరీశ్ రావుకు కౌంటర్ ఇచ్చారు. తనను అవమానించిన వారికి తానేంటో తెలుసునని ఒకింత కన్నీటిపర్యంతమయ్యారు. ఖమ్మం జిల్లాకు గోదావరి నీళ్లు ఇవ్వాలనేది తన సంకల్పం అన్నారు. తాను కట్టిన వంతెనలు, రోడ్లు తనకు పేరు తెచ్చాయని వ్యాఖ్యానించారు. అంతేకానీ తాను ఫ్లెక్సీల నాయకుడిని కాదన్నారు. తాను చేసిన పనులే తన ఫ్లెక్సీ అన్నారు. తాను ఏ ప్రభుత్వంలో పని చేసినా ప్రజల కోసమే పని చేశానన్నారు. తాను ఎన్నికల్లో ఓడిపోతే వ్యవసాయం చేసుకున్నానని తెలిపారు. కానీ ప్రచారం కోసం బటన్ నొక్కే వ్యక్తిని కాదన్నారు. ఉమ్మడి ఏపీలో మంత్రిగా ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొన్నానన్నారు. వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే మీడియా సమావేశం పెట్టినట్లు చెప్పారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన ఆవేదనను



చెప్పదలచుకున్నానన్నారు. భద్రాద్రి శ్రీ రామచంద్రుని దయవల్ల... ఎన్టీఆర్ ఆశీర్వాదంతో వేలాది టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతుంటే.. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనేది తన సంకల్పమన్నారు. నాడు ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ ఇబ్బందుల వల్ల దుమ్ముగూడెం కాకుండా దేవాదుల ప్రాజెక్టు చేపట్టామన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ ఆధారంగా దుమ్ముగూడెం ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్ట్ చేపట్టాలని కోరానన్నారు. కానీ వైఎస్ అకాల మరణం తర్వాత ఇవి పూర్తి కాలేదన్నారు. తాను నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పని చేశానని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ ఫలితంగా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అధికారంలోకి వచ్చిందని, ఆ రోజు ప్రాజెక్టు కోసమే కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌లో చేరానన్నారు. కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక కేవలం పంప్ హౌస్‌లు మాత్రమే నిర్మాణం చేశారని, రోళ్ళపాడు బయ్యారం అలైన్‌మెంట్ మార్చారని పేర్కొన్నారు. బీజీ కొత్తూరు, పూసు గూడెం, కమలాపురం పంప్ హౌస్‌లు పూర్తి చేయడానికి వాగులు వంకలు వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేయలేదన్నారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రతిపాదనలు చేశానన్నారు. అలాగే జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేస్తేనే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్లు వస్తాయన్నారు. భగవంతుడు ఇచ్చిన అవకాశంతో వెంసూరుకు తమ్మిలేరుకు, ఎన్టీఆర్ కెనాల్‌తో సాగునీళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. అత్యంత కరవు పీడిత ప్రాంతాల్లో 32 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు తానే చేశానన్నారు. పాలేరు కరవుకు శాశ్వత పరిష్కారంగా భక్త రామదాసు లిఫ్ట్ ప్రాజెక్ట్ నిర్మాణం చేశానని, తాను నిర్మాణం చేసిన సాగు నీటి ప్రాజెక్టులపై రైతాంగం సంతోషంగా ఉన్నారని తెలిపారు.

# కవిత నెక్స్ట్ స్టెప్ ఏంటీ

**హైదరాబాద్ :** ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈఏడాది మార్చి 15న అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ తనయ ఐదు నెలలుగా జైల్లోనే ఉన్నారు. ఆమె బెయిల్ కోసం అనేక కారణాలతో వేసిన పిటిషన్లను ఇటు రవూస్ అవెన్యూ కోర్టు.. అటు ఢిల్లీ హైకోర్టు తిరస్కరించాయి. దర్యాప్తు సంస్థలు బెయిల్ ఇవ్వకూడదని వాదిస్తున్నాయి. దీంతో ఆమె ఇప్పటి వరకు చేసిన బెయిల్ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. తాజాగా ఆమె ఢిల్లీ మద్యం కేసులో ఈడీ, సీబీఐ దాఖలు చేసిన కేసుల్లో తనకు బెయిల్ ఇవ్వాలంటూ కల్వకుంట్ల కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ రావడంతో కల్వకుంట్ల కవిత కూడా తనకు బెయిల్ వస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. కానీ సర్వోన్నత న్యాయస్థానంలో కూడా ఆమెకు నిరాశే ఎదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం నిరాకరించింది. ఎమ్మెల్సీ కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారుఓ ప్రజాప్రతినిధిగా, మహిళ అయిన కవితను ఇంకెంత కాలం జైల్లో ఉంచుతారు అంటూ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ కేసులో ఇప్పటికే బెయిల్ పొందిన మనీశ్ సిసోడియా, కేజ్రీవాల్ కేసులను ఉదహరించారు. అయితే, రోహత్గీ వాదనల సందర్భంగాం కేసు పెట్టిన ఈడీ, సీబీఐలకు తాము నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ గవాయి స్పష్టంగా చేశారు. దీంతో కనీసం మధ్యంతర బెయిల్ అయినా ఇవ్వండి అని కవిత లాయర్ రోహత్గీ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు జస్టిస్ గవాయి నిరాకరించారు. వారి అభిప్రాయాలను వెల్లడించిన తర్వాతే వాదనలు వింటామని తెలిపారు. అప్పటి వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేశారు. ఈ లోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఈడీ, సీబీఐలకు ఆదేశాలు జారీ చేశారు.ఇదిలా ఉంటే.. ఇప్పటికే కవిత రవుస్ అవెన్యూ కోర్టును, ఢిల్లీ హైకోర్టును పలుమార్లు బెయిల్ కోసం ఆశ్రయించారు. దర్యాప్తు సంస్థలు బెయిల్ ఇవ్వొద్దని వాదించాయి. ఈ స్కాంలో కవితే కీ పిన్ అని, ఆమె సాధారణ వ్యక్తి కాదని, బయటకు వస్తే సాక్షాలు తారుమారు



చేస్తారని తెలిపాయి. ఇప్పటికే మద్యం పాలసీ కేసులో కవిత సాక్ష్యాలను ధ్వంసం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని విన్నవించాయి. మహిళ అనే కారణంగా బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, అత్యంత ప్రభావం చూపే వ్యక్తిగా కవితను దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. దర్యాప్తు సంస్థల వాదనలతో కోర్టులు ఏకీభవించాయి. దీంతో బెయిల్ పిటిషన్లను తిరస్కరించాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఆరోపణలు ఎదుర్కొంటూ భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో తీహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. దాదాపు 5 నెలల నుంచి ఆమె జైల్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో బెయిల్ కోసం ఆమె చేయని ప్రయత్నాలు అంటూ లేదు. తాజాగా సోమవారం కూడా సుప్రీంకోర్టులో బెయిల్ కు సంబంధించి కవితకు మరోసారి చుక్కెదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం ఒప్పుకోలేదు. కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. " కవిత ఒక మహిళా ప్రజా ప్రతినిధి. ఎమ్మెల్సీగా ఉన్నారు. విచారణ పేరుతో ఆమెను ఇంకెంతకాలం జైల్లో ఉంచుతారు. ఇప్పటికే ఈ కేసులో మనీష్ సిసోడియా, అరవింద్ కేజ్రీవాల్ కు ఊరట లభించింది. వారికి బెయిల్ మంజూరయింది. కవితకు కూడా బెయిల్ మంజూరు చేయాలని" రోహత్గీ వాదించారు.రోహత్గీ వాదనల సమయంలోనే ఈడీ, సీబీఐ లకు నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ గవాయి పేర్కొనడం విశేషం. ఇదే క్రమంలో కనీసం మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత తరపు లాయర్ రోహత్గీ న్యాయస్థానాన్ని విన్నవించారు. ఇందుకు గవాయి ఒప్పుకోలేదు. వారు అభిప్రాయాలను వెల్లడించిన తర్వాతే.. వాదనలు వింటామని.. అప్పటివరకు ఆమెకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 20 కి వాయిదా వేస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. ఈలోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఈడీ, సీబీఐ కి ఆదేశాలు జారీ చేసింది. ఇక కవిత ఇప్పటికే దిగువ న్యాయస్థానాలలో బెయిల్ కోసం పిటిషన్లు దాఖలు చేశారు. అయితే అందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు గట్టిగా కౌంటర్ ఇచ్చాయి.."కవిత సామాన్యమైన వ్యక్తి కాదు. ఆమె సాక్షులను తీవ్రంగా ప్రభావితం చేస్తారు. ఇలాంటి సమయంలో విచారణ అనేది పక్కదారి పడుతుంది. అలాంటప్పుడు ఆమె జైల్లోనే ఉండాలని" దర్యాప్తు సంస్థలు కోర్టుకు విన్నవించాయి. వారి వాదనలతో ఏకీభవించిన కోర్టు కవితకు బెయిల్ మంజూరు చేయలేదు. మనీష్ సిసోడియాకు బెయిల్ రావడంతో.. కవితకు కూడా ఊరట లభిస్తుందని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. దీంతో భారత రాష్ట్ర సమితి నాయకులు మరోసారి నిరాశలో మునిగిపోయారు. కాగా ఇటీవల కవిత అరెస్టుకు సంబంధించి తొలిసారి కేసీఆర్ స్పందించారు. బిడ్డ అరెస్టు అయితే ఈ తండ్రికి మాత్రం బాధ ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

## రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్

రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంవీ భూపాల్ రెడ్డి రూ.8 లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయారు. జాయింట్ కలెక్టర్ ఎంవీ భూపాల్ రెడ్డితో పాటు సీనియర్ అసిస్టెంట్ వై.మదన్ మోహన్ రెడ్డిని లంచం వ్యవహారంలో వల పన్ని, అరెస్ట్ చేసినట్టు ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ధరణి పోర్టల్ లోని నిషేధిత భూముల జాబితా నుంచి 14 కుంటల భూమిని తొలగించడానికి వారు రూ.8 లక్షల లంచం తీసుకుంటుండగా... ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డిని, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరూ పట్టుబడకుండా లంచం తీసుకోవడానికి అనేక జాగ్రత్తలు తీసుకున్నారని, కానీ వారి ఎత్తుగడలను తాము చిత్తు చేశామని ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్ తెలిపారు.

## రుణమాఫీ, రైతుబంధుపై కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా?

-మొదటిపేజీ తరువాయి

విఫలమైందన్నారు. తెలంగాణలో 30 లక్షల మందికి రైతు రుణమాఫీ జరగలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని, కాబట్టి ఇప్పుడే వెళ్లి రుణాలు తీసుకోవాలని ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేశారు. అలాగే రైతులతో



పాటు కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ ఇప్పటి వరకు దానిని ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఏ హామీని నెరవేర్చడం లేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతాంగానికి ప్రధానంగా నాలుగు హామీలు ఇచ్చిందని ఈటల వెల్లడించారు. అందులో మొదటిది రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రెండోది... రైతులకు, కౌలు రైతులకు రైతుబంధు, మూడోది... అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్, నాలుగోది రైతు కూలీలకు నెలకు రూ.1000 చొప్పున 12 నెలలకు రూ.12 వేలు వేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ మీద కోపంతోనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు తప్ప... మిమ్మల్ని చూసి కాదని గుర్తించాలని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఐదేళ్ల కోసం ప్రజలు మీకు అధికారం కట్టబెట్టారని, అందులో ఇప్పటికే 8 నెలలు పూర్తయిందన్నారు. కానీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూ పాలన సాగించవద్దని హితవు పలికారు.

## రాజ్యసభకు పెరుగుతున్న ఆశవహులు

-మొదటిపేజీ తరువాయి

పడుతున్నారు. సీనియర్ నేతల నుంచి గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వాళ్లంతా ఈ పోస్టుకోసం ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్ నేతలకు కొదవలేదు. పార్టీని నమ్ముకుని పదేళ్ల నుంచి ఉన్న వారు అనేక మంది ఉన్నారు. పార్టీ జెండాను వదలకుండా అధికారంలోకి వచ్చినా, రాకపోయినా పార్టీని బలోపేతం చేయడం కోసం చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు వాళ్లంతా పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు 2023 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయిన నేతలు కూడా తమకు రాజ్యసభ స్థానం ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారని తెలిసింది. తాము ఇన్నేళ్లు పడిన కష్టానికి తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. హైకమాండ్ ఇంకా దీనిపై వారికి ఎలాంటి హామీ ఇవ్వలేదు.. అయితే సీనియర్ నేత వి. హనుమంతరావు ఈ పోస్టుపై బాగా ఆశలు పెట్టుకున్నారు. అలాగే గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కని అద్దంకి దయాకర్ సయితం తనకు పదవి వస్తుందని ఆశతో ఉన్నారు. వీరితో పాటు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన మధుయాష్కీ వంటి వారు కూడా తమకున్న పలుకుబడితో ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసి తమకు రాజ్యసభ స్థానం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు మరికొందరు సీనియర్ నేతలు కూడా ఇప్పటికే ఢిల్లీ బాట పట్టారు. కొందరు నేతలు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి తమ పేరును హైకమాండ్ కు పంపాలంటూ వినతులను అందచేస్తున్నారు.కానీ హైకమాండ్ ఆలోచన వేరే విధంగా ఉందన్న ప్రచారం జరుగుతుంది. సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ పేరును హైకమాండ్ పరిశీలిస్తున్నట్లు ఢిల్లీ లెవెల్లో ప్రచారం జరుగుతుంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు పోటీ పడుతుండటంతో మధ్యేమార్గంగా అభిషేక్ మను సింఘ్వీ కి ఆ స్థానం కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గతంలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాగా, అందులో ఒకటి రేణుకా చౌదరి, మరొకటి అనిల్ కుమార్ యాదవ్ కు ఇచ్చారు. ఇప్పుడు ఈ రాజ్యసభ స్థానాన్ని పార్టీ సీనియర్ నేతకు ఇవ్వాలన్న నిర్ణయానికి రావడంతో తెలంగాణ నేతల్లో ఆశలు వమ్ము అయ్యాయి. ఈ పోస్టు కూడా పోయినట్లేనా? అన్న నిరాశలో కొందరు నేతలున్నా

## స్ట్రాంగ్ టీమ్ ఏర్పాటులో రేవంత్

**హైదరాబాద్ :** రాజకీయాల్లో అనుభవం ముఖ్యం కాదు. అప్పటికప్పుడు అనువైన నిర్ణయాలు తీసుకోవడమే రాజకీయాల్లో రాణిస్తారు. గతంలో మంత్రి పదవి కూడా దక్కని రేవంత్ రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి పదవి దక్కించుకున్నారు. ఇది ఆయన వద్దకు చేరిన పదవి కాదు. శ్రమించి.. చెమటోడ్చి తన వద్దకే పదవిని రప్పించుకున్నారు. ఉద్దండులను, సీనియర్ నేతలను తోసిరాజని ఆయన పదవి తెచ్చుకోవడం ఆషామాషీ కాదు. ఎందుకంటే అది కాంగ్రెస్ పార్టీ. ఒకరు ముందుకు నెడితే.... నలుగురు వెనక్కు లాగుతారు. అలాంటి కాంగ్రెస్ ను తన నాయకత్వంలో అధికారంలోకి తేవడం నిజంగా రేవంత్ రెడ్డి లక్కు అనే చెప్పాలి. పదేళ్లు ఎవరికీ సాధ్యం కానిది తాను చేసి చూపించారన్న పేరును హైకమాండ్ వద్ద తెచ్చుకోగలిగారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అనేక అనుమానాలు బయలుదేరాయి. బీఆర్ఎస్ నేతలే ఈ ప్రభుత్వాన్ని కూల్చి వేస్తామని బహిరంగ హెచ్చరికలు జారీ చేశారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని నేతలు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ను సోదిలో లేకుండా చేయగలిగారు. ఒక్క సీటు రాకుండా చేయడంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. ఎందుకంటే రైతు రుణమాఫీతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల అమలుకు తేదీలు చెప్పి మరీ ప్రజలను మరలా కాంగ్రెస్ వైపు సమర్థవంతంగా తిప్పగలిగారు. వచ్చింది ఎనిమిది స్థానాలయినా తక్కువమీ కాదు. ఎందుకంటే బీజేపీని తట్టుకుని మరీ కాంగ్రెస్ పార్టీ ఎనిమిది పార్లమెంటు స్థానాలను దక్కించుకోగలిగింది.ఇక కాంగ్రెస్ లోనూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఎన్నాళ్లు ఉంటారన్న అనుమానం అందరిలోనూ కలిగింది. ఈ నేపథ్యంలో తన చుట్టూ ఉన్న టీంను ఆయన గట్టిగా చేసుకున్నారు. ముఖ్యంగా దళిత సామాజికవర్గానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క లేకుండా రేవంత్ రెడ్డి అడుగు కూడా బయటపెట్టరు. ప్రతి కార్యక్రమంలో ఆయన తన వెంట ఉండేలా చూసుకుంటున్నారు. ఢిల్లీ వెళ్లినా.. మరో చోటకు వెళ్లినా భట్టికి ఇచ్చే గౌరవం మరొక నేతకు ఆయన ఇవ్వడం లేదు. అలాగే ఎన్నికలకు ముందు వరకూ తనపై ఒంటి కాలుపై లేచే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలను కూడా ఆయన దారికి తెచ్చుకోగలిగారు. ఎంతగా అంటే మరోసారి సీఎం రేవంత్ అనే అన్నంత తరహాలో వారు చేస్తున్న వ్యాఖ్యలు రేవంత్ వారిని ఏ రకంగా సెట్ చేయగలిగారో చెప్పకనే చెప్పాలి. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను తన వైపునకు రప్పించడంలో కూడా రేవంత్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. మైండ్ గేమ్ ఆడి కొందరు నేతలను నేరుగా బీఆర్ఎస్ నుంచి పార్టీలోకి తెచ్చుకోగలిగారు. స్థానికంగా కాంగ్రెస్ నాయకత్వం నుంచి కొంత ఇబ్బందులు ఎదురయినప్పటికీ రేవంత్ రెడ్డి వారిని బుజ్జగించి మరీ పార్టీలో చేర్చుకున్నారు. జగిత్యాల వంటి చోట సీనియర్ నేత జీవన్ రెడ్డి అలక బూనినా అక్కడి నుంచి సంజయ్ కుమార్ కు పార్టీ కండువా కప్పడంలో సక్సెస్ అయ్యారు. ఇలా ఒక్కొక్కటి అధిగమిస్తూ అసెంబ్లీలో, మండలిలో కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటూ పోతున్నారు. నిత్యం ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కారానికి చూపుతూ కేసీఆర్ కు, తనకు మధ్య తేడాను చూపిస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి రోజు రోజుకూ స్ట్రాంగ్ అవుతున్నారు. ఇక అమెరికా పర్యటనతో పెట్టుబడులు తేవడంలో సక్సెస్ అయి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏమాత్రం తీసిపోమని నిరూపించుకోగలిగారు.

# సంపాదకీయం

## యువతకు రాజకీయాలలో ప్రాధాన్యం ఏదీ!

భారత దేశ జనాభాలో15- 29 యేళ్ల యువత 27.5శాతం వున్నారు. యువత జాతి ప్రగతికి సంధాన కర్తలు' అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది .మన దేశంలో యువత శాతం పెరుగుతుంది .మన దేశ%శీ% 2020 నాటికి ప్రపంచములో అత్యంత 'యువ దేశంగా" నిలిచింది. దేశ జనాభాలో 40 శాతం ఉన్న యువత అత్యంత మానవ వనరు అని చెప్పవచ్చు జాతి భవిష్యత్తు వారే కనుక యువత నిర్వహించాల్సిన పాత్ర మహత్త రమైంది.వారి సృజనాత్మకత ఉత్సాహం' శక్తి కలిసి దేశంలో అద్భుతఫలితాలివ్వగలవు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు దోహదపడేభలమైన మానవ వనరులు యువత దేశాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపే సత్తా వున్న యువతకు దేశ రాష్ట్ర స్థాయి రాజకీయాలలో వివిధ రాజకీయ పార్టీలు యువకులకు విద్యావంతులకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ రాజకీయ పార్టీలు అనుబంధ సంఘాలలో విద్యార్థి సంఘాలు. యువజన సంఘాలు. మరికొన్ని సంఘాలలో యువకులు విద్యావంతులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రతి రాజకీయ పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమం. ప్రతి ఎలక్షన్. ఎన్నికల సభలు ధర్నాలు పాధయాత్రల్లోసమావేశాలలో యువకులు విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు జయప్రదం చేయడంలో ముదుండి ప్రధానమైన పాత్ర పోషించడం జరుగుతుంది. జాతీయ రాజకీయ పార్టీలు 'ప్రాంతీయ రాజకీయ పార్టీలు 'ఉప ప్రాంతీయ పార్టీలు యువతను విద్యావంతులను ఓటు బ్యాంకుగా ఓట్లను సమీకరించె కార్యకర్తలుగా ఉపయోగించుకోవడం రాజకీయ పార్టీల సాంప్రదాయమైంది. విద్యా వంతులైన యువతకు చట్టసభలలో ఎన్నిక కావడానికి విద్యార్థి సంఘం తరపున. యువజన సంఘం తరపున. కుల సంఘాల తరపున. వారి వారి జనాభా మరియు ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన రిజర్వేషన్ పద్ధతి ప్రకారంగా. వారు పార్టీలలో అనుబంధ సంఘాలలో పనిచేస్తున్న సీనియారిటీ ఆదరంగా గ్రామ పంచాయితీ వార్డ్ సభ్యుని నుండి 'మండల జిల్లా 'పరిషత్ మున్సిపాలిటీ మిన్సిపల్ కార్పొరేషన్లు 'ఎమ్మెల్యే 'ఎంపీ ఎమ్మెల్యే' పదవులకు జరిగే చట్ట సభ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా విద్యా వంతులైన యువతకు అవకాశం కలిపించాలి. యువతకు 50 శాతం టికెట్స్ ఇవ్వాలి లియువతకు విద్యావంతులకు తప్పనిసరిగా 50% సీట్లు కేటాయించవలసిన అవసరం ఎంతైనా ఉంది. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లుగానే నేటి యువత విద్యావంతులే రేపటి భవిష్యత్తు దేశ ప్రగతి రథ సారథులు. భవిష్యత్తు చట్ట నిర్మాతలు కనుక దేశ భవిష్యత్తు వీరిపైనే ఉంది. జనాభాలో15 బి 29 యేళ్ల వయసున్న యువత 27.5 శాతం వుంది యువ శక్తి వనరులు ఎక్కువ వున్న దేశంగా భారత్ ప్రపంచములో గుర్తించ బడ్డది . విద్యావంతులలో గ్రాడ్యుయేషన్. పోస్ట్ గ్రాడ్యుయేషన్. డాక్టరేట్ పట్టభద్రులు కూడా వివిధ సంఘాలలో వివిధ రాజకీయ పార్టీలలో వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వార్డు సభ్యుడు మొదలుకొని పార్లమెంటు సభ్యుడు వరకు చట్టసభలకు జరిగే సార్వత్రిక మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీలు టికెట్స్ ఇవ్వాలి గతంలో యువత రాజకీయ పార్టీ లో పార్టీకి చేసిన సేవలు సీనియారిటీ నిబద్ధత ప్రజా సంభందాలు మొన్నగు అంశాలనులెక్కలోకి తీసుకోవాలి. రిజర్వేషన్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత రాజకీయాలు ఉపాధి కల్పనభారత దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలల్లో నిరుద్యోగం ప్రధానమైనది. "ఓనామాల నుండి డాక్టరేట్ డిగ్రీ "వరకు ఉన్నత విద్యలను అభ్యసించిన కూడా ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదు.. కనుక సామాజిక అంశాలపై సంక్షేమ పథకాలపై దేశ పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన యువతకు విద్యావంతులకు చట్ట సభలకు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు టికెట్లను కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాలలో యువకులకు నాయకత్వము కలుగుతుంది గ్రామీణ సమస్యల పరిష్కారానికి యువత శక్తివంతంగా పనిచేసే అవకాశం ఏర్పడుతుంది.నిరుద్యోగ యువతకు రాజకీయ రంగములో పరోక్షం గా ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి కొంతవరకు నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. యువత సంఘ విచ్చిన్నకర కార్యకలాపాలకు దూరంగా వుండే అవకాశం కలుగుతుంది. రాజకీయ పార్టీలు విద్యావంతులైన యువతకు చట్టసభలకు ప్రజాప్రతినిధులుగా అవకాశాలు కల్పించాలి. గుణాత్మక మార్పులు యువత భాగస్వామ్యం ప్రతి జిల్లా కేంద్రాలలో ఎంప్లాయిమెంట్ కార్యాలయాలలో నిరుద్యోగులుగా ఉద్యోగ. అవకాశాల కోసం సంవత్సరాల పాటుమ్ఖఐ. ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు నైపుణ్యాభివృద్ధి రాజ్యాంగ. అంశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రగతి పథకాల అమలులోశిక్షణ ఇవ్వాలి శిక్షణ పొందిన యువత ప్రజలను వివిధ పథకాలలో భాగస్వాములను చేస్తూ దేశములో గుణాత్మక పరిమానాత్మక మారుపల సాధనలో యువశక్తిని సంపూర్ణంగా ఉపయోగించాలి. సామాన్యుని ముంగిట్లో ప్రగతి ఫలాలు యువత ప్రజాస్వామ్యం ప్రగతి ఫలాలు సామాన్యుని ముగిట్లోకి చేర్చడానికి యువత కృషి చెయ్యాలి. యువతకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజల సేవ చేయడానికి అవకాశం కల్పించాలి. వారికి అవకాశాలు దక్కకపోవడంతో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో రాజకీయ పార్టీలు వివిధ అనుబంధ సంఘాలలో సేవలు మాత్రమే ఉపయోగించుకొని వారికి తగిన అవకాశాలు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులుగా. పని లేకపోవడం వల్ల సోమరులుగా తయారై మత్తుకు మాదక ద్రవ్యాల వినియోగం' దొంగతనాలకు డ్రగ్స్ కు అలవాటు పడి నేరాలకు పాలుపడుతున్నారు. వివిధ వ్యసనాలకు అలవాటు పడి నిరాశ నిస్పృహలకులోనై డిప్రెషన్ తో ఆత్మహత్యలకు పాల్పడి వారి కుటుంబ సభ్యులకు గర్భ శోకం కలిగిస్తున్నారని అనేక సామాజిక ఆర్థిక సర్వేల్లో వ్యక్తమైంది. యువత కుటుంబ సభ్యులపై వృద్ధులైన తల్లిదండ్రులపై బ్రతుకు భారంగా రోజులు సాగదీస్తున్నారు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం:స్వాతంత్ర్య అనతరం తెలంగాణ ఉద్యమం వరకు దేశములో జరిగిన సాంఘిక రాజకీయ పౌర ఉద్యమాల వ్యూహాల్లో కార్యకలాపాల్లో యువత కేంద్ర బిందువుగా వుండడం గమనార్హం. రాజకీయ పార్టీలుయువతను పార్టీజెండాలు పట్టి జై కొట్టడానికి గొంతులు చించుకొని నినాదాలు బిగ్గరగా ఇవ్వడానికి మాత్రమే వీరిని ఉపయోగించుకుంటే సరిపోదు. రాజకీయ పార్టీలకు కనువిప్పు. మైకెల్ గ్రీస్ రాసిన " సామాజిక రాజకీయ మార్పులో క్రియాశీలక ప్రతినిధులుగా యువత" అనే పుస్తకములో యువతలో సానుకూల దృక్పథం కలిగించి అభివృద్ధికి అనువుగా మలుచుకోవడం అనేది ఎప్పటికప్పుడు విస్తృత స్థాయిలోని బలీయమైన ఉద్యమము చేపట్టాల్సి ఉంటుందనీ పేర్కోవడం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి.ప్రస్తుతం రాష్ట్రంలోనూ. దేశంలోనూ వివిధ రాజకీయ పార్టీలలో వివిధ విభాగాల్లో ప్రతినిధులుగా వివిధ హొదాలలో పనిచేస్తున్నయువత సేవలను గుర్తించాలి. పెరిగిన జనాభా వల్లనిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయినా కనీసం ప్రజా ప్రతినిధులుగా ప్రజాసేవ చేయడానికి అవకాశం కల్పించాలని వివిధ రాజకీయ పార్టీలకు యువత విద్యావంతుల అభిప్రాయ పడుతున్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు కొన్ని సందర్భాలలో ప్రజాప్రతినిధులుగా గ్రామాలలో మహిళ ప్రజా ప్రతినిధులు. స్థానిక సంస్థలలో గెలిచి ప్రభుత్వ పనితీరు %శ్రీ%సంక్షేమ పథకాల పై అవగాహన లేక సభలు సమావేశాలలో ఉత్సాహ విగ్రహంగా ఉండి ప్రజలకు ప్రభుత్వానికి ఆశించిన మేరకుఏమాత్రం ప్రజాప్రతినిధిగా పూర్తిస్థాయిలో సేవా అందించలేకపోతున్నారు. గ్రామ పంచాయితీ వార్డ్ మెంభెర్ నుండి అసెంబ్లీ పార్లమెంటు కుపోటి చేసే అభ్యర్థులకు కనీస విద్యార్హత లు నిబంధన అమలు చెయ్యాలి. విద్యావంతలైన యువతకు స్థానిక సంస్థల నుండి చట్ట సభలకు ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించి సామాజిక ఆర్థిక.వికాసంలో విజ్ఞానవంతులను బాగస్వాములను చెయ్యాలి . నేటి యువత రేపటి నాయకులుఅనే నినాదాన్ని మానుకొని నేటి యువత నేటి నాయకులే అన్న స్పృహ రాజకీయ పార్టీలకు కలుగాలి చట్ట సభలకు యువతను ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించి రాజకీయ పార్టీలు యువత రాజకీయాల్లో రాణించి ప్రజాసేవ చేయడానికి రాచబాట వెయ్యాలి. అభివృధి కర ఆదర్శ వంతమైన భారత్ నిర్మాణములో అన్ని రంగాలలోస దూసుకుపోతున్న యువతకు రాజకీయ రంగములో ప్రవేశం కల్పించాలి.చట్ట సభల్లో అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కలిపించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి.

# అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధకాంక్ష!



ఇజ్రాయిల్ దాని దుర్మార్గాలకు నిస్సిగ్గుగా వత్తాసు పలకటమే కాదు, సాయుధ రక్షణకు నౌకా, వైమానిక దళాలను రప్పిస్తూ ఆయుధాలను తరలిస్తున్న అమెరికా చర్యలతో మధ్యప్రాచ్యంలో ఎప్పుడైనా ప్రాంతీయయుద్ధం తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ఈ దుష్ట కూటమిని ఎదుర్కొనేందుకు ఇరాన్ దానికి మద్దతుగా ఉన్న సాయుధశక్తులు కూడా సిద్ధంగాక తప్పని స్థితి. హమాస్ నేత హనీయేను ఇరాన్ గడ్డమీద, హిజబుల్లా కమాండర్ ఫాద్ షుకుర్ను లెబనాన్లో హత్య కావించటం రెచ్చగొట్టే కుట్రలో భాగం తప్ప మరొకటి కాదు. దానికి తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, హిజబుల్లా ప్రకటించింది. తమ మీద దాడి చేసి పౌరులను హతమార్చిన హమాస్ సాయుధులను అణచివేసి కొద్ది గంటల్లోనే బంధీలుగా ఉన్న తమవారిని విడిపించుకుపోతామని ఇజ్రాయిల్ ప్రకటించి పది నెలలు దాటింది. రోజు రోజుకూ ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న నిరాయుధుల మీద మారణ కాండ సాగించటం తప్ప హమాస్ సాయుధులను పట్టుకున్న జాడలేదు. 'ఒక వీరుడు మరణిస్తే ఉద్భవింతురు వేయిమంది' అన్నట్లుగా కొంత మంది హమాస్ నేతలను హతమార్చినా నాయకులు పుట్టుకువస్తూనే ఉన్నారు. హనియే హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించినప్పటి నుంచి మధ్యధరా సముద్రం, ఎర్ర సముద్రం ప్రాంతాల్లోకి అమెరికా విమానవాహక యుద్ధ నౌకలు, ఖండాంతర క్షిపణులను ప్రయోగించే ఆధునిక యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లను పెద్దఎత్తున తరలిస్తున్నది. అందువలన ఇరాన్ కూడా తన జాగ్రత్తల్లో తానుంది. రక్షణరంగంతో సహా గతంలో రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు ఆయుధాలు, రక్షణ వ్యవస్థలను దిగుమతి చేసుకుంటున్నది. గతంలో ఇరాన్కు అందచేసిన రక్షణ వ్యవస్థలను ఇజ్రాయిల్ వమ్ము చేసిందని, మరోసారి వాటిని ఇచ్చి ఎందుకు పరువును ఫణంగా పెట్టుకుంటారంటూ పశ్చిమ దేశాల వ్యాఖ్యాతలు కొందరు రష్యా మంచిని కోరుకుంటున్నట్లు ఫోజు పెడుతున్నారు. పదినెలలైనా హమాస్ను పట్టుకోలేక పసిపిల్లల ను, మహిళల మీద ప్రతాపం చూపుతున్నారు. వారికి తానతందానా అంటు న్నారు సిగ్గులేదా, మానవత్త కబుర్లు చెబుతున్నారు, మీకేం పోయేకాలం వచ్చిందని అదే వ్యాఖ్యాతలు ఇజ్రాయిల్కు, అమెరికాకు ఎందుకు గడ్డిపెట్టటం లేదు.పాలస్తీనాపౌరుల న్యాయమైన డిమాండ్లకు గతంలో మద్దతిచ్చిన కొన్ని ఇరుగుపొరుగు దేశాలు మధ్యలో వదిలేసి అమెరికా చంకనెక్కి ఇజ్రాయిల్తో యుగళగీతాలు పాడుతున్నప్పటికీ మాతృభూమి కాంక్ష తగ్గలేదు. యూదు దురహంకారులు, మిలిటరీ దాడుల మధ్య పుట్టి పెరుగుతున్న వారికి శాంతియుత పరిస్థితి అంటే ఎలా ఉంటుందో తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆత్మగౌరవంతో మాతృభూమిలో బతకటమా లేక వీరమరణం పొందటమా అన్నదే తప్ప వారికి మరొకటి తెలియదు. గాజాలో తమ పిల్లలు, మహిళలను హతమారుస్తున్నా, నివాసాలను నేలమట్టం గావిస్తున్నా వెన్ను చూపటం లేదు, వెనక్కు తగ్గటం లేదు. తమ నేతలు కొందరిని దొంగదెబ్బతీసి చంపినా పిరికిబారటం లేదు. పాలస్తీనా మహత్తర లక్ష్యం కోసం పోరాడుతున్నవారికి మద్దతుగా ఉన్న ఇరాన్ మీద, దానికి వెన్నుదన్నుగా ఉంటున్న రష్యా మీద పశ్చిమదేశాలు ఏదో ఒకసాకుతో ఆంక్షలు అమలు చేస్తున్నప్పటికీ అవి వెంట్రుకతో సమానమన్నట్లుగా ఆ దేశాల నేతలు ముందుకు పోతున్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దగ్గర ఆధునిక ఆయుధాలు ఉండవచ్చు. గాజాలో హమాస్ దాదాపు ఆరువందల కిలోమీటర్ల మేర సొరంగాలు తవ్వుతున్నా, నలభైవేల మంది విముక్తి యోధులను తయారు చేస్తున్నా పసిగట్టలేకపోయారు. ఆ సొరంగాల్లో బందీలుగా ఉన్న తమ వారి ఆచూకీ కనుగొనేందుకు అవేమీ పనికిరాలేదు. తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడు వస్తాడు. గాజా, లెబనాన్, ఎమెన్ వైపుల నుంచి ఒకేసారి పాలస్తీనా మద్దతుదారులు దాడులకు దిగితే తమ పరిస్థితి ఏమిటని ఇజ్రాయిల్ సాధారణ పౌరులు కూడా నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. దానికి నెతన్యాహు ఆ నరరూపరాక్షసుడికి మద్దతు ఇస్తూ కొట్టండి, చంపండి అంటున్న జో బైడెన్ వంటి అపరమానవతావాదులు తప్ప మరొకరు కాదు. అందువలన ఇజ్రాయిలీలు కూడా తమ మిలిటరీ జరుపుతున్న దారుణాలను ఖండించాల్సిన అవసరం ఉంది. మధ్య ప్రాచ్యంలో మంటలు చెలరేగితే వాటికి వారూ మాడి మసికావాల్సిందేనని గుర్తించటం అవసరం.

# సామాజిక సంస్కర్త గోపరాజు లవణం


జి. లవణం లేదా లవణంగా సుపరిచితులు అయిన గోపరాజు రామచంద్ర లవణం (10 అక్టోబర్ 1930 - 14 ఆగష్టు 2015)... గోరా గా ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్ర రావుకు లవణం పెద్ద కుమారుడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన ఆయనకు లవణం అని పేరు పెట్టారు. తొమ్మిది మంది సంతానం కాగా, గోరా తన కుమారులకు వారు వుట్టినప్పటి ప్రపంచ, దేశ పరిస్థితులకు అద్దం పడుతూ విలక్షణమైన పేర్లు పెట్టాడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన కుమారునికి లవణం అని, భారతీయులు ఛట్ట సభల్లో నిలిచి గెలిచిన కాలంలో పుట్టిన కొడుక్కు విజయం: అని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పుట్టిన కుమారులకు సమరం, నియంత అని, తొమ్మిదవ సంతానానికి నవ్ అని పేర్లు పెట్టారు. గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పుట్టిన అమ్మాయికి మైత్రి అని, మరో కుమార్తె పేరు మనోరమ అని పెట్టారు. లవణం తండ్రి బాటలో నడిచాడు. లవణం భారతీయ సామాజిక సంస్కర్త. గాంధేయవాది, హేతువాది. ఆయన భారతీయ సమాజంలోని అంటరానితనాన్ని తొలగించడానికి పని చేశాడు. ఆయన నాస్తికుడు. ఆయన సతీమణి హేమలత లవణంతో కలిసి సంస్కార్ సంస్థను స్థాపించారు. నాస్తికమార్గం పత్రికల సంపాదకుడుగా పని చేసాడు. లవణం చిన్నతనం లోనే స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నాడు. 1973లో విజయవాడ హేతువాద సంఘ అధ్యక్షుడిగా నియమితుడు అయినాడు. అస్పృశ్యతా నిర్మూలన కుల నిర్మూలన కోసం కృషిచేశాడు. నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్ గుర్రం జాషువా యొక్క కుమార్తె హేమలతను మహాత్మా గాంధీ ఆశ్రమంలో వివాహం చేసుకున్నాడు. గాంధేయ విలువలకు కట్టుబడి సామాజిక అభ్యున్నతికి అంకితమై పని చేశాడు. మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, వినోబా భావేల ప్రభావంతో, నిరాడంబరంగా ఎలా జీవించాలో వారి నుంచే నేర్చుకున్నాడు. సామాజిక జాగృతికి అనేక విధాల కృషి చేస్తున్న లవణం హేతువాదం, నాస్తిక వాదంపై అనేక గ్రంథాలు రచించాడు. సంఘం, ది ఎథిస్ట్, నాస్తిక మార్గం పత్రికలు లవణం సంపాదకీయంలో వెలువడ్డాయి. భారత నాస్తిక కేంద్రం డైరెక్టర్ గా వ్యవహరించాడు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపాడు. హేమలత, లవణం దంపతులు గొప్ప సంఘ సంస్కర్తలు. సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో ఉంటూ జిల్లాలో ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని, అనేక సంఘసేవా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 'జోగినీ' దురాచార వ్యవస్థను, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించి, ప్రజలను చైతన్య పరచి, దురాచారాలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. "ప్లాన్ ఇంటర్నేషనల్" వారి ఆర్థిక సాయంతో అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్ని రామకృష్ణారావు సలహా మేరకు అక్బర్ నగర్ గ్రామంలో గ్రామస్థుల సహాయంతో ప్రకృతి ఆశ్రమాన్ని 1997 లో ప్రారంభించడం జరిగింది. అయితే 2006 లో సంస్థతో చేసుకున్న 9 సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అయిపోవడం వల్ల వచ్చే రోగులు ఇచ్చే ఆదాయంతో ఆశ్రమం నిర్వహించడం కష్టం అయింది. పల్లెటూరు అవడం, మరియు 5,10 కి మించి రోగులు రాకపోవడం వల్ల ఆశ్రమ నిర్వహణ కష్టమయింది. ఆ సమయంలో లవణం దంపతులు, మార్ని రామకృష్ణారావును కలసి మంతెన సత్యనారాయణ రాజుకు ఆ ప్రకృతి ఆశ్రమం ఉచితంగా 33 సంవత్సరాల లీజు అగ్రిమెంటుతో అప్పగించడం జరిగింది. అలా సంస్కార్ ప్రకృతి ఆశ్రమం అతి తక్కువ ఫీజులతో భారత దేశంలో మరెక్కడాలేనంత తక్కువ ధరలలో వైద్యసేవలందింస్తోంది. నాస్తికత్వం - అభివృద్ధి-చరిత్ర 1978, కోవూర్ జీవితం 1980 తదితర రచనలు చేశాడు. నేను నాస్తికుడిని, దేవుని నమ్మను. పూజించను. ఇతరులు ఎంతోమంది నమ్ముతారు. పూజిస్తారు. ఒకరి భావాలు మరొకరికి నచ్చవు. కొందరు నన్ను వ్యతిరేకిస్తారు. ఇంకొందరు ముఖం మీదనే తిడతారు. అయినా నేను వారి పట్ల ద్వేష భావం పెంచుకోను. పోట్లాటకు, వాదనలకు దిగను నేను స్వతహాగా హాస్య ప్రియుడిని, ఎప్పుడూ సరదాగా ఉండాలనుకునే మనస్తత్వం నాది అని తరుచూ చెపుతుండేవాడు. 1991లో అంతర్జాతీయ నాస్తికత్వాన్ని 1980 నుండి 1990 వరకు ప్రోత్సహించి నందుకు లాస్ ఏంజిల్స్ లోని నాస్తికుల యునైటెడ్ నుండి నాస్తికుడు అవార్డు, 2009లో డీనోటిఫైడ్ తెగల సభ్యులకు పునరావాసం మరియు ఉపాధి అవకాశాలను అందించి నందుకు జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 2011లో ప్రపంచ శాంతికి మరియు మానవత్వానికి సేవ చేసినందుకు వైష్ణవ సెంటర్ ఫర్ ఎన్లైట్మెంట్తో అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ నుండి లైఫ్‌ఎమ్ అచీవ్ మెంట్ అవార్డు, 2015లో మానవ హక్కులు మరియు సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషికి హైదరాబాద్ లోని ప్రోబ్ రిసోర్స్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్ నుండి అంతర్జాతీయ హ్యూమనిస్ట్ అవార్డు తదితరాలు ఆయనకు లభించాయి. కొంత కాలం ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ, 2015, ఆగష్టు 14న విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# దేశవిభజన మిగిల్చిన విషాదాలు

అనాలోచితంగా, అజ్ఞానంగా, వివాదాస్పదంగా, అకారణంగా, విభజించి విచ్ఛిన్నం చేయాలనే దుర్బుద్ధితో అఖండ భారతాన్ని ఇండియా, పాకిస్థాన్‌గా అశాస్త్రీయ రాజకీయ విభజన చేసిన కారణంగా నాటి ప్రజలు పడ్డ బాధలు, విద్వేషాలు, హింసాగ్నిలో లక్షల ప్రజలు నిర్వాసితులు కావడం, మాన ప్రాణాలు కోల్పోవడం హిందుస్థాన్‌లో ఓ మరువలేని మహావిషాద దుర్ఘటన. మతపరంగా విభజన కోరిన ముస్లిమ్‌లు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినాన్ని 14 ఆగష్టున పాటిస్తున్నారు. శవాల కుప్పలు, ధౌర్జన్యకర విషాదాల పునాదిగా జరిగిన విభజన దేశ చరిత్రలో ఓ చీకటి రోజు. 1947 ఆగష్టు 15 అర్ధరాత్రి లభించిన భారత స్వాతంత్ర్యానికి సంబరాలు చేసుకోవాలో, విభజన విషవలలో చిక్కిన అమాయక ప్రజలు కోల్పోయిన మాన ప్రాణాలను చూసి దుఃఖించాలో తెలియని దుస్థితి నాటి ప్రతి బాధ్యతగల భారతీయ పౌరుడిది. బ్రిటీష్ పాలకులు వ్యాపార బుద్ధితో ప్రవేశించి, దేశ సంస్కృతీ వారసత్వాలను నాశనం చేసి, దేశ సంపదను పీల్చేసి, శవాల దిబ్బలను మిగిల్చి వెళ్ళిన దుర్దినమది. ముఖంపై స్వాతంత్ర్యం దక్కిందనే సంతోషం, మదిలో విభజన చేసిన గాయాల బాధల నడుమ దేశం పరాయి పాలన నుండి విముక్తం అయ్యింది. విభజన అకాలంలో జరిగిన హింసాత్మక ఘటనలు, మారణహోమాలు భారతీయులపై చెరగని శాశ్వత మచ్చలుగా మిగిలిపోయాయి. అఖండ భారతదేశ విభజన అత్యధిక మానవ వలసలను చవి చూసింది. లక్షల కుటుంబాలు, దాదాపు 2 కోట్ల ప్రజలు తమ తమ వారసత్వంగా వచ్చిన పల్లెలు, పట్టణాలు, నగరాలు, జన్మ భూములను వదిలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొత్త జీవితాలను వెతుక్కోవలసిన దుస్థితి అది. దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతం, హింసోన్మాదానికి, అరాచక అకృత్యాలకు బలైన భరతమాత బిడ్డలను స్మరించుకోవాలనే సదభిప్రాయంతో ప్రతి ఏట 14 ఆగష్టున 'విభజన విషాద స్మృతి దినం (పార్టీషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే)' పాటించాలని నిర్ణయించడం సముచితమే కాదు హర్షదాయకం కూడా. 15 ఆగష్టు 1947 స్వాతంత్ర్య సంబరాల వేదికగా మహాత్మా గాంధీ మాట్లాడుతూ 'రెండు దశాబ్దాల తెల్ల దొంగల దాస్య శృంఖలాలను ఛేదించుకొని, బానిస బతుకులకు చరమగీతం పాడుతూ భారతీయులు స్వేచ్ఛావాయువులు పీల్చాలంటూనే, దేశ విభజనకు అంగీకరించాలి' అని కోరారు. గత 77 ఏండ్లుగా విభజన గాయాలను మర్చిపోలేనప్పటికీ, సమగ్రాభి వృద్ధి దిశగా నిరంతరం ప్రగతి పయనాలు కొనసాగుతునే ఉన్నాయి. భారతదేశం పట్ల కనీస జ్ఞానం లేని బ్రిటీష్ లాయర్ 'సర్ సిరిల్ రెడ్‌క్లిఫ్' అఖండ భారత పటంపై గీసిన దేశ సరిహద్దు గీతలు కోట్ల ప్రజలకు పెనుశాపాలుగా మారడంతో పాటుగా, ఆ జ్ఞాపకాలు మన గుండెల్ని నేటికి విషాద సంద్రంలో ముంచేస్తూనే ఉన్నాయి. సువిశాల భారత విభజనతో ఇండియా, పాకిస్థాన్ (ఈస్ట్ అండ్ వెస్ట్ పాకిస్థాన్) ఏర్పడ్డాయి. ముస్లిమ్‌లు అధికంగా ఉన్న పంజాబ్ ప్రాంతాన్ని వెస్ట్ పాకిస్థాన్(నేటి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్)గా, ముస్లిమ్‌లు అధికంగా ఉన్న బెంగాల్ ప్రాంతాన్ని ఈస్ట్ పాకిస్థాన్‌గా (నేటి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్) వేరు చేశారు. ఈస్ట్ పాకిస్థాన్ ప్రజల కోరిక మేరకు 1971లో ఇండో-పాక్ యుద్ధంలో బంగ్లాదేశ్‌ను విముక్తం చేయడంలో కూడా భారత దేశం 2,500-3,843 మంది సైనికుల ప్రాణాలు కోల్పోవడం, 12,000 మంది జవాన్లు గాయాల పాలుకావడం, అపార ఆర్థిక నష్టాన్ని భరించడం చూశాం. 1947లో జరిగిన దేశ విభజన ప్రపంచ చరిత్రలో అతి పెద్ద హింసాత్మక, రక్తం ఏరులై పారిన అర్థరహిత రాజకీయ మానవ వలసగా చరిత్రకారులు పేర్కొంటారు. మిలియన్ల మానవ వలసలు, లక్షల మరణాలు, వేల మానభంగాలతో అత్యంత అమానవీయంగా దేశ విభజన మరువలేని విషాదాన్ని మిగిల్చింది. పాకిస్థాన్ ప్రాంత హిందువులు, సిక్కులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భారత సరిహద్దుల్లోకి పరుగులు తీయడం, భారత్‌లోని ముస్లిమ్‌లు అధికంగా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకోవడం కూడా విస్మయంతో చూశాం, నేటికీ సమైక్యతకు కలుగుతున్న విఘాతాలను భరిస్తున్నాం.

# ఏసీబీ వలలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
ట్రాప్లో చిక్కిన సీనియర్ అసిస్టెంట్
8 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత
ఇద్దరి ఇళ్లల్లో పెద్ద ఎత్తున సోదాలు
అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు



**రంగారెడ్డి,ఆగస్టు13(శాసన సభ ):** ఉన్నత హెూదాలో కొనసాగుతూ ఆదర్శంగా ఉండాల్సిన కొందరు ప్రభుత్వ అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. లంచం తీసుకోవటం నేరమని తెలిసినా.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నాచితక ఉద్యోగులే కాదు..పై స్థాయి ఉద్యోగులు సైతం లంచాలకు మరుగుతున్నారు. తాజాగా.. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపుతోంది. గత రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షల లంచం తీసుకుంటూ అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ధరణిలో నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు ఓ వ్యక్తి నుంచి రూ. 8 లక్షలు డిమాండ్ చేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఇద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు సమీపంలో డబ్బులు కారులో పెట్టుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. జక్కిడి ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14 గుంటల భూమిని ధరణి వెబ్ సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుండి తొలగించాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే అందుకు సీనియర్ అసిస్టెంట్ మదన్‌మెహన్ రెడ్డి రూ. 8 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముత్యంరెడ్డి నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలవేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అడ్డంగా దొరికిపోయిన మదన్.. జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి పేరు తెరపైకి తీసుకొచ్చాడు. జాయింట్ కలెక్టర్ చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీకి చెప్పాడు. దాంతో తమ ముందే ఏసీబీ అధికారులు జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేయించారు.. మదన్ మోహన్ జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తాను ముత్యం రెడ్డి డబ్బులు తీసుకున్నట్లు చెప్పాడు. దీంతో ఆ డబ్బును తీసుకొని పెద్ద అంబర్ పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు జాయింట్ కలెక్టర్ ఫోన్‌లో మదన్ మోహన్‌కు సూచించాడు. అప్పటికే అక్కడ కాపు కాసిన ఏసీబీ అధికారులు పెద్ద అంబర్‌పేట వద్ద జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి మదన్ మోహన్ డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాగోల్‌లోని భూపాల్ రెడ్డి నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. అక్కడ కూడా కొంత మ్రొత్తంలో డబ్బు దొరికినట్లు తెలిసింది. ఈ మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తప్పించుకోలేరు..లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న ఏసీబీ నుండి తప్పించుకోలేరని సీనియర్ ఐపీఎస్ సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు. ఇందుకు నిన్న రాత్రి జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడమే నిదర్శనమన్నారు. ఈ ఇద్దరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేశారన్నారు. ఎప్పటికప్పుడు ప్రణాళికలను మార్చుకుంటూ ఇద్దరు లంచగొండి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు.

# చింతపల్లి రైతు వేదికలో రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సు







మాదకద్రవ్యాల నిర్మూలన ? ఆవశ్యకత
రైతులు గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు వర్తించవని సమావేశంలో వెల్లడి
రూపుమాపల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
గంజాయి రవాణా చేయడం సేవించడం రెండూ తప్పే
చింతపల్లి వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి

**చింతపల్లి ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** చింతపల్లి రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు దృశ్య శ్రవణ మా ధ్యమం( వీడియో కాన్ఫరెన్స్) ద్వారా చిరుధాన్యాలు, మొక్కజొన్న యొక్క యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు రైతులతో చర్చించడం జరిగింది. పురుగు మందుల అవశేషాలను ఎలా నియంత్రించుకోవాలి అనే అంశంపై కూడా శాస్త్రవేత్తలు చర్చించారు. అనంతరం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన-అవశ్యకత గురించి రైతులందరికీ అవగాహన కార్యక్రమం నిర్వహించి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు "మిషన్ పరివర్తన్" లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏ ఎస్ ఐ చంద్రారెడ్డి గంజాయి సేవించచడం వల్ల కలిగే దుష్ప్రభాలను రైతులకు వివరించారు. చింతపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి మాట్లాడుతూ గంజాయి సాగు చేసినా అమ్మినా వాడినా రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవని, ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతున్నచో తమకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి అనేది ఒక సామాజిక రుగ్మత అని దాన్ని రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నరసింహ్మా, మధు, అరుణ, మాధురి, శ్రీలత, మౌనిక, రైతులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం పలుకూడళ్లలో "హర్ ఘర్ తిరంగ" ర్యాలీ







కార్యక్రమానికి హాజరైన పలు బాధ్యతల బీజేవైఎం శ్రేణులు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** ఆశాధికా అమృత మహెూత్సవ్ లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ "హర్ ఘర్ తిరంగా "పిలుపు మేరకు బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కేంద్రంలో మంగళవారం తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది. యువకులతో ఇబ్రహీంపట్నం పుర విధుల్లో జాతీయ జండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ , బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షులు బూడిద నర్సింహ్మారెడ్డి, దొండ రమణ రెడ్డి పాల్గొన్నారు. జాతీయ జెండాలతో 500 మందితో ర్యాలీతో వెళ్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.
ముఖ్య అతిధులు మాట్లాడుతూ. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా, జాతీయ జెండా లతో ర్యాలీలు నిర్వహించడం వలన దేశ ఐక్యత పెంపందించుకోవడం అని అన్నారు. స్వతంత్ర్య సమర యోధులను గౌరవించుకోవడం, వారికీ నివాళులు అర్పించడం చాలా సంతోషమన్నారు. యువకులు అందరూ ప్రతి ఇంటిపైన జాతీయ జండాలు ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమం లో బిజెపి నాయకులు జంగయ్య గౌడ్, తాండ్ర రవి , బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రూపక్,బీరప్ప జిల్లా కార్యదర్శి విజయ్, మేకం ఐలేష్, సందీప్, వెంకటేష్, శశిధర్ రెడ్డి, బీజేవైఎం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు మహేందర్, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, యాచారం అధ్యక్షులు నాగరాజు, మంచాల అధ్యక్షులు రాజు,ముత్యాల అనిల్,రాఘవేందర్, విజయ్, ఆకుల సంతోష్, అశోక్, బిజెపి, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చీమల వెంకటేష్- కృష్ణవేణిల

# వివాహ వార్షికోత్సవ మహెూత్సవం

**దంపతులను సన్మానించిన మిత్రబృందం**

**చింతపల్లి, ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** చింతపల్లి ప్రెస్ రిపోర్టర్ అసోసియేషన్ సభ్యులు, చింతపల్లి మిత్ర బృందం ఆధ్వర్యంలో విశాల భారతి చింతపల్లి మండల రిపోర్టర్ చీమల వెంకటేష్ – కృష్ణవేణి దంపతులు ఐదవ వసంతంలోకి అడిగిన సందర్భంగా ఆయన స్వగృహంలో తన మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రుల సమక్షంలో మంగళవారం నాడు కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవ మహెూత్సవం జరుపుకున్నారు. హాజరైన మిత్ర బృందం శాలువాలతో సన్మానించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు భాబన్న, వనమాల వెంకటేష్,పసునూరు వెంకటేష్, సతీష్, శివర్ల రమేష్ యాదవ్, ఉప్పల యాదయ్య, బొడ్డు మహేష్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, గంగలి వెంకటయ్య, వనం మధు, గజ్జ అభినవ్, కుందేళ్ళ శ్రీశైలం, గడ్డి మహేందర్, కడారి రవికాంత్, పాలకూర్ల రాజు, దూదిమెట్ల వెంకటయ్య, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.




## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రవేశానికై దరఖాస్తు చేసుకోండి

చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమా వత్ లక్ష్మి



**చింతపల్లి ఆగస్టు 13 శాసనసభ న్యూస్:**ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రవేశానికి ఆసక్తి కలవారు దరఖాస్తులు చేసుకోవాలని చింతపల్లి జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రామావత్ లక్ష్మి పేర్కొన్నారు. వివిధ కారణాల చేత చదువు మధ్యలో మానివేసిన వారికోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైట్( టి ఓ ఎస్ ఎస్ )ఆధ్వర్యంలో నిర్వహించబడే ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని మండల పరిసరప్రాంత వాసులు ఎవరైనా ఆసక్తి,అవసరం కలవారు అడ్మిషన్లు పొందవచ్చని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతపల్లి ప్రధానోపాధ్యాయురాలు రమావత్ లక్ష్మి తెలిపారు.చదువు మధ్యలో మానివేసిన వారికి ఇది మంచి సదవకాశమని ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 10వ తారీఖు వరకు అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.ఓపెన్ పదవ తరగతి అడ్మిషన్ల కోసం వారు చదివిన రికార్డు షీట్,ఆధార్ కార్డు,కుల ధ్రువీకరణ పత్రం,ఫోటో సమర్పించాలని,ఇంటర్ అడ్మిషన్ల కోసం పదవ తరగతి పాస్ మెమో ,టీసీ, కులదృవీకరణ పత్రం,ఆధార్ కార్డు,ఫోటో తో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. ఇంటర్ కోర్సు ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకోవచ్చని, వివరాలకు అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి సుందరయ్య పోన్ నెంబర్ 9440927542 సంప్రదించాలని కోరారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇస్తే సహించేదిలేదు




**మంచాల, ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ నేడు సీఐటీయూ ఆధ్వర్యంలో మంచాల మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించి మెమొరాండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పథకం యూనియన్ జిల్లా కోశాధికారి సరిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ లాంటి సంస్థలకు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరుపుతున్నారని దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. గత 24 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల పైచిలుకు కార్మికులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టడం జరుగుతుందని అన్నారు. సంవత్సరానికి ఒకటి రెండుసార్లు బిల్లులు, జీతాలు వచ్చినా అప్పులు చేసి వంటలు చేసి పెడుతున్నామని గుర్తు చేశారు. బిల్లులు సకాలంలో అందించక ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేయడం జరుగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని చూస్తుందని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా మధ్యాహ్న భోజనాన్ని హరే రామ హరే కృష్ణ, అక్షయపాత్ర లాంటి సంస్థలకు అప్పజెప్పాలని కొడంగల్ లో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడానికి ప్రయత్నించారు. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన అలాంటి ఆలోచనలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ నాయకులు అలివేలు, రాజమ్మ,లక్ష్మమ్మ, భారతమ్మ,అనిత, రాణి, యాదయ్య, రాధమ్మ , పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాయి నాధుని సేవలో పలువురు ప్రజాప్రతినిధులు



**చింతపల్లి, ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** హైదరాబాద్ బి నాగార్జునసాగర్ చింతపల్లి ప్రధాన రహదారి లో కొలువై ఉన్న రెండవ శిరిడిగా పేరుగాంచిన శ్రీ సాయి బాబా ఆలయాన్ని సందర్శించిన పలువురు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, రాంరావు పటేల్, హరీష్ రావు, బిజెపి హస్తినాపురం డివిజన్ ఇంచార్జ్ కొట్టం నరేష్ యాదవ్ మంగళవారం రోజు చింతపల్లి సాయి సన్నిధిని సందర్శించారు. ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించి సాయినాధుని సన్నిధిలో వేదమంత్రాల సాక్షిగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులచే ఆశీర్వచణం తీసుకున్నఅనంతరం ఆలయ పాలకవర్గం శాలవాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి సన్నిధి ఆలయ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్దే ధ్యేయంగా ఆదిభట్ల పురపాలక సంఘం

**ఆదిభట్ల పురపాలక సంఘం చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి**




**ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం ప్రతినిధి ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** ఆదిభట్ల పురపాలక సంఘం పలుఅభివృద్ధి పనులలో భాగంగా వినతులు విన్నవిస్తే వెంటనే సమస్యలకు పరిష్కారం చూపుతూ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పటేల్ గూడా గ్రామంలో 13వ వార్డు నందు సుజ్ఞానం ఇంటి నుండి బొగిడి జంగయ్య ఇంటి వరకు సిసి రోడ్ నిర్మాణం, కొంగరకలాన్ తండా 6వ వార్డు నందు కోల ఫకీర ఇంటి నుండి నిదాన కవి అంజయ్య ఇంటి వరకు వరద నీటి పైపులైన్, పీర్ల కొట్టం ముందు, ఆంగోత్ కవిత ఇంటి ముందు సి సి రోడ్డు నిర్మాణం చేయుటకు 19 లక్షల ఖర్చుతో శంకుస్థాపనలు చేయడం జరిగింది.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**మాదక ద్రవ్యాల వల్ల కలుగు నష్టాలపై అవగాహన కల్పించాలి**

**గంజాయి సాగు, రవాణా జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలి**

**మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి :** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ విస్తరణ అధికారులతో తనిఖీ చేయించాలని, మారు మూల గ్రామాలు , బార్డర్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గంజాయి మొక్కలు కనిపిస్తే పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. అటవీ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోకి మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా చెక్ పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. డ్రగ్స్ తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలని, చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, డ్రగ్స్ ఇన్స్ పెక్టర్ పి.శ్రావణ్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా రవాణా అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# డైట్ చార్జీలపై అధికార కమిటీ వేస్తాం



**మెట్ పల్లి :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ వార్షిక సంవత్సరం బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం. రాష్ట్రవ్యాప్తంగా పక్కా భవనాలు లేని గురుకులాలకు భవన నిర్మాణం కోసం కావలసిన నిధులు స్థల సేకరణ కు కావలసిన నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ల కాన్ఫరెన్స్లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పాలకులు గురుకుల భవనాల నిర్మాణాలకు నిధులను కేటాయించి విషయంలో నిర్లక్ష్యం వహించారు. ఈ వార్షిక సంవత్సరం గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలకు బడ్జెట్లో రూ. 5 వేల కోట్లు కేటాయించాం. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల కరంగా డైట్ చార్జీలు పెంచడానికి అధికారులతో కమిటీ వేస్తం కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత డైట్ చార్జీలను పెంచుతామని అన్నారు. పెద్దాపూర్ లో విద్యార్థుల మృతి చెందడం దురదృష్టకరం చాలా బాధాకరం రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రగ్భ్రాంతికి కలిగించింది మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. బాధిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా తో పాటు గురుకుల సొసైటీలో వారి విద్యా హారతుకు అనుగుణంగా ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తాం. బాధిత కుటుంబాలకు ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించాను. మృతి చెందిన విద్యార్థుల పోస్టుమార్టం నివేదిక రాగానే దాని ఆధారంగా విచారణ జరిపిస్తాం. పెద్దాపూర్ గురుకుల పాఠశాల లో నీటి కుంటలు చెత్తాచెదారం లేకుండా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడానికి టాయిలెట్స్ నిర్మాణం కోసం ఇతర సౌకర్యాలు కల్పించడానికి తక్షణమే రాష్ట్రప్రభుత్వం 50 లక్షలు మంజూరు చేసింది. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా పక్కాభవనాలు డార్మెటరీ డైనింగ్ హాల్స్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించిన వెంటనే ఒక్కరోజు ఆలస్యం చేయకుండా నిధులు మంజూరు చేస్తానని అన్నారు.

## సమస్యల పరిష్కారం కాలేదని ప్రభుత్వంపై ఉద్యోగుల అసంతృప్తి

హైదరాబాద్ : తెలంగాణలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన దాదాపు పది నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆరోపిస్తున్నాయి. నాంపల్లిలో ఉన్న తెలంగాణ నాన్గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో ఉద్యోగ సంఘాలు సోమవారం సమావేశమయ్యాయి. డిమాండ్లు సాధించుకునేందుకు జేఏసీ ఏర్పాటుకు తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ సంఘాల నేతలు అంగాకరించారు. దీనికి చైర్మన్గా టీఎన్జీఓ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఉంటారు. ప్రాతినిధ్యం వహించనున్నాయి. కాంగ్రెస్కు అనుబంధంగా ఉండే పీఆర్టీయూటీజీ సైతం వీళ్లతో కలవడం ఆసక్తిరేపుతోంది. మొత్తం 15 మందితో ఈ జేఏసీ ఏర్పాటు అయింది. అయితే రాష్ట్రంలో ఉన్న ఇతర సంఘాల నేతలను సంప్రదించి పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. తర్వాత డిమాండ్ల సాధనపై ప్రభుత్వంతో సంప్రదింపులు చేయనున్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు దాటింది. 4 డీఏ బకాయిలు, పీఆర్సీ , హెల్త్ కార్డుల జారీ, సీపీఎస్ రద్దు, జీవో 317 సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఎటూ తేల్చలేదు. అయితే ఆర్థిక పరిస్థితిని దృష్టి పెట్టుకొని కొంత సమయం కావాలని సీఎం అభ్యర్థన మేరకు ఇన్ని రోజులు ఆగామని ఇకపై ఆగే పరిస్థితి లేదంటున్నాయి ఉద్యోగ సంఘాలు. ఇప్పటికే ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చామని అంటున్నారు. ప్రస్తుతానికి విదేశీ పర్యటనలో సీఎం ఉన్నారని ఆయన వచ్చిన తర్వాత ఉద్యోగ సంఘాల జేఏసీ వెళ్లి రేవంత్రెడ్డిని కలుస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారంపై ఆయన నుంచి వచ్చిన స్పందన బట్టి తమ కార్యాచరణ ఉంటుందన్నారు జేఏసీ నేతలు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వందల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది కేవసం 30 మాత్రమే అన్నారు. మిగతా వాటిని దశల వారీగా పరిష్కించుకోవడానికి తాము సిద్ధమని తెలిపారు. ఆర్థిక సమస్యలు లేని వాటిపైనే ప్రధానంగా దృష్టి పెట్టి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికీ కొందరు ఉద్యోగులకు ఆలస్యంగా జీతాలు అందుతున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

**ప్రభుత్వం దృష్టికి ఉద్యోగ సంఘాలు తీసుకెళ్తున్న సమస్యల చిట్టా ఇదే**

నాలుగు డీఏ బకాయిలు విడుదల

సీపీఎస్ రద్దు.. కొత్త పీఆర్సీ అమలు.. జీవో 317 సమస్యల పరిష్కారం.. పెండింగ్ బిల్లులు చెల్లింపు

టీచర్స్కి ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్

# కమిషనరేట్ పరిధిలో వాహనాల తనిఖీలు

**జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి, అనురాధ**




**సిద్దిపేట :** రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అక్రమ రవాణా నివారణ గురించి వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగింది ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించకుండా నెంబర్ ప్లేట్ లేని 62 వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 72 నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి, అనురాధ మాట్లాడుతూ. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాజీవ్ రహదారిపై మరియు ఇతర రహదారులపై నిన్న సాయంత్రం నుండి రాత్రి వరకు ప్రత్యేకంగా వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగింది. వాహనాల తనిఖీలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 72 నమోదు చేయడం జరిగింది, మరియు నెంబర్ ప్లేట్ లేని వాహనాల 62 కేసులు నమోదు చేయడం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మరియు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా నివారించడం గురించి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ నిర్వహిం చడం జరిగిందన్నారు. తరచుగా సర్ప్రైజ్ వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు నెంబర్ ప్లేట్ తప్పకుండా వేయిం చుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తరచుగా లాడ్జిలలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మీ బాబు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, శ్రీనివాస్, మరియు సంబంధిత ఎస్ఐలు, పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇసుక రీచ్ ఆప్రోచ్ రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు చర్యలు**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి :** సుల్తానాబాద్ మండలంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, నూతన ఇసుక రీచ్, తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలోని నీరుకుల్లా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు. గట్టేపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ పర్యటన సందర్భంగా అవెన్యూ ప్లాంటేషన్ ను కలెక్టర్ పరిశీలించారు. నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతన రోడ్లకు ఇరువైపులా ఎత్తైన మొక్కలతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులకు సూచించారు.సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల, గట్టెపల్లి గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఇసుక రీచ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇసుక రీచ్ లకు అవసరమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించా లని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సుల్తానా బాద్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పెండింగ్ జరిగిన దరఖాస్తుల వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలు జిల్లా కలెక్టర్ వెంట సుల్తానాబాద్ తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సచిన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు ఎవరు ఆక్రమించలేదు

**రోడ్డు వేయాలని కోరాం**

**అందుకు ప్రభుత్వం అనుమతించాలి.**

**అనాజ్ పూర్ నాగన్ పల్లి రైతుల వివరణ**



**ఇబ్రహీంపట్నం ప్రతినిధి ఆగస్టు 13 శాసనసభ న్యూస్:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని నాగన్ పల్లి, అనాజ్ పూర్ గ్రామాల భూములు రైతులు తెరమీదకొచ్చారు. తమ భూములను ఎవరు ఆక్రమించలేదని తెలిపారు. తాము అమ్ముకోలేదని వివరణ ఇచ్చారు. నాగన్ పల్లికి చెందిన లక్ష్మయ్య గౌడ్, నల్ల బాలరాజు, నిట్టు బాలయ్య, సిహెచ్ బాలయ్య, బాలరాజు, ఎం అబ్బయ్య, ఎన్.బుగ్గయ్య, రమణయ్య, యాదగిరి అనే రైతులు మంగళవారం నాగన్ పల్లి సర్వే నెంబరు 189లో వేసిన రోడ్డును పరిశీలించారు. తమకు ప్రభుత్వం 189 సర్వే నెంబర్లు ప్రభుత్వం అసైన్మెంట్ పట్టాలు జారీ చేసిందన్నారు. కానీ ఆ భూములను సాగు చేసుకునేందుకు రోడ్డు మార్గం లేకపోవడం వల్ల పడావు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. తమ భూముల సమీపంలోనే జీనియస్ కంపెనీ వారు వెంచర్ చేస్తున్నందున వారిని కలిసి తమ భూములకు కూడా రోడ్డు మార్గం వేయాలని కోరడం జరిగిందని చెప్పారు. అందువల్ల తమ భూముల్లో కొంత భాగాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేసి రోడ్డు వేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఈ రోడ్డుకు అనుమతి ఇవ్వాలని కోరారు. రోడ్డు వేయడానికి సహకరించాలని జీనియస్ కంపెనీ కోరినట్లు తెలిపారు. కానీ తమ భూములను ఎవరూ ఆక్రమించలేదన్నారు. మోసైనమెంట్ భూములను ఎవరికి అమ్మలేదని పేర్కొన్నారు. లీజుకు కూడా ఇవ్వలేదన్నారు. తమ భూములో రోడ్డు వేయడానికి జీనియస్ కంపెనీ మిషనరీని వాడుకుంటున్నామ్మారు. భూములకు మా కోరిక మేరకు వేస్తున్న రోడ్డు మార్గాన్ని అడ్డుకోవద్దని కోరారు.

## బిల్ కలెక్టర్ రాసలీలలు..

**శాసన సభ :** కర్ణాటకలో హాసన్ ఎంపీ ప్రజల్వ్ రేవణ్ణ సెక్స్ స్కాండిల్ ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలుసు. అతడు చేసిన అరాచకాలు బయటపడటంతో జెడీఎస్ అతడ్ని పార్టీ నుండి సస్పెండ్ చేసింది. ఇప్పుడు రాష్ట్రాన్ని ఈ అంశమే కుదిపేస్తుంది. ఈ సమయంలో మరో ప్రభుత్వ ఉద్యోగి రాసలీలలు బయటకు వచ్చాయి. అతడు గ్రామ పంచాయతీలో పని చేస్తున్నాడు. ప్రజలకు సేవలందించాల్సిన ఆ గవర్నమెంట్ ఎంప్లాయి.. కేవలం మహిళలకు మాత్రమే సర్వీసు అందిస్తున్నాడు. రేవణ్ణను మించిపోయి.. మహిళలను బెదిరించి, లోబర్చుకుని కామ వాంఛ తీర్చుకుంటున్నాడు. ఇప్పుడు ఇతగాడి రాసలీలల పర్వం వీడియోల రూపంలో బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని కోలార్ జిల్లాలోని కేజీఎఫ్ తాలూకాలోని రామసాగర గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్గా అర్జున్ హరికృష్ణ (36) విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ ముసుగులో మహిళలతో రాసలీలలు సాగిస్తున్నాడు. ఈ కామ క్రీడలు బయటకు వచ్చాయి. తోటి ఉద్యోగినితో ముద్దులు ముచ్చట్లతో తేలిన వీడియోలు, ఫోటోలు బయటకు వచ్చాయి. ఒక గ్రామ పంచాయతీలో ఉద్యోగులు ఆఫీసు పనివేళల్లో బహిరంగంగా ముద్దులు తీసుకుంటూ సెల్ఫీలు తీసుకోగా.. ఈ వీడియోలు హల్ చల్ చేస్తున్నాయి. దీంతో ఇద్దరిపై తీవ్ర విమర్శలు మొదలయ్యాయి. వర్క్ ప్లేసును ఇలా తమ కామ క్రీడలకు వినియోగించుకుంటున్నారంటూ మండిపడుతున్నారు నెటిజన్లు. వృత్తి పట్ల నిబద్ధత, గౌరవంగా ఉండాల్సిన ఇద్దరు ఉద్యోగులు చేయాల్సిన పనేనా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై గ్రామస్థుల చొరవతో మహిళా ఉద్యోగిని బయటకు వచ్చింది. అర్జున్ పై కేసు నమోదు చేసింది. తనను బలవంతంగా లోబర్చుకున్నాడని పేర్కొంది. బాధితురాలు మాట్లాడుతూ పంచాయతీలో ఉద్యోగం పర్మినెంట్ చేయడంతో పాటు, భర్తకు కూడా ఉద్యోగం కల్పిస్తానని తనకు ప్రలోభాలు పెట్టేవాడని తెలిపింది. తన భర్తకు వాటర్మ్యాన్ ఉద్యోగం, ప్రభుత్వ గృహం ఉచితంగా ఇప్పిస్తానని హామీ ఇచ్చి హరికృష్ణ తనను లొంగదీసుకున్నాడని, తన ఆఫర్ నిరాకరిస్తే ఉద్యోగాన్ని తొలగిస్తానని బెదిరించేవాడని తెలిపింది. అలా తనను వినియోగించుకున్నాడని, తనతో సన్నిహితంగా గడిపిన సమయంలో ఫోటోలు తీసి.. వాటిలో బ్లాక్ మెయిల్ చేసేవాడని బాధితురాలు పేర్కొంది. హరికృష్ణపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ సభ్యులు పిడిఓకు విన్నవించారు. బాధితురాలిని ఒప్పించి ఆమెతో బేత మంగల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారు. బాధితురాలి ఫిర్యాదుతో బిల్ కలెక్టర్ను పోలీసులు అరెస్టు చేశారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా ..కేవలం ఈ ఒక్క మహిళతోనే కాకుండా ఇలా అనేక మంది మహిళలను బెదిరించి, భయపెట్టి లోబర్చుకుని, తన కామ వాంఛను తీర్చుకున్నాడని పోలీసులు తేల్చారు.

## రాళ్లవాగుపై వెంటనే బ్రిడ్జి నిర్మించాలి

**కలెక్టర్కి వినతి పత్రం అందించిన**

**టిడిపి పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షులు సంజయ్ కుమార్**

**మందమర్రి :** మందమర్రి మండలం లో గల ఊరు మందమర్రి, మామిడి గూడెం పెద్దధర్మారామ్ లో రాళ్ల వాగు ప్రతి సంవత్సరమ్ వర్ష కాలంలో పక్కనే ఉన్న మందమర్రి కి రాకపోకలు ఉండవు.పిల్లలు స్కూల్ కి పోవడం మానేస్తారు, గర్భిణీ ఎంతో మంది హాస్పిటల్ కి పోలేక ప్రాణాలు కూడా పోగొట్టుకున్న రు నిత్యావసరసరుకులు కూరగాయలు కూడా పోవాలంటే 15కిలోమీటర్లు తిరిగి పోవాలి... ఒకరిద్దరు ముసల్లోలు వాగులో కొట్టుకు పోయిన సందర్భలు కూడా ఉన్నాయ్..ఊరు ప్రజలు మందమర్రి టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కీ తమ బాధలు చెప్పుకోవాడినికి వెళ్లిన సందర్భంగా కలెక్టర్ అందుబాటులో లేక జాయింట్ కలెక్టర్ కి ప్రజలు తమ బాధను నేరుగు చెప్పుకున్నారు.ఈ విషయం కలెక్టర్ దుష్టికి తీసుకెళ్లి తొందర్లోనే పరిస్కారం అయ్యేలా చూస్తాము అని హామీ ఇచ్చినారు.

ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి.. ఎండీ శారీఫా, టీడీపీ మందమర్రి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ టీడీపీ కారం రాజు, జయశ్రీ , జూపాక సంధ్య, నర్సయ్య, రసూల, తిరుపతి,నాగలక్ష్మి,ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30లోగా సిఎంఆర్ డెలివరీ లక్ష్యాలు సాధించాలి

**జయశంకర్ భూపాలపల్లి :** సెప్టెంబర్ 30 వ తేదీ వరకు సి.ఎం.ఆర్ డెలివరి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రైస్ మిల్లర్లును ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సి ఎం ఆర్ ప్రక్రియ వేగవంతం చేయుటపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో వానాకాలం 2023 కు సంబంధించిన 16 వేల మెట్రిక్ టన్నుల సి.ఏం.ఆర్ పెండింగ్ లో ఉందని సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ లో రా రైస్ కు ఎక్కువ డిమాండ్ ఉందని మిల్లర్లు ఎంత ఎక్కువగా మిల్లింగ్ చేస్తే అంత తొందరగా రానున్న వానాకాలం పంటకు మిల్లర్లు సిద్ధంగా ఉండొచ్చని అన్నారు. మిలర్లతో ప్రతి 15 రోజులకు ఒకసారి మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మిల్లర్లు సి.ఏం.ఆర్ డెలివరి లో జాప్యం వహిస్తే అట్టి ధాన్యాన్ని మరొక మిల్లుకు కేటాయిస్తామని అన్నారు.క్రమం తప్పక మిల్లులు పని చేయాలని రేపటి నుండి రెవెన్యూ అధికారులు మిల్లింగ్ తీరును తనిఖీ చేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల సంస్థ డి ఎం రాగ వేందర్, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఐదు నెలల కనిష్టానికి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ

**న్యూఢిల్లీ:** భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిని లెక్కించే పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) జూన్‌లో ఐదు నెలల కనిష్టానికి పడిపోయింది. 4.2 శాతంగా నిలిచింది. మే నెలలో ఈ సూచీ 6.2 శాతంగా ఉండగా, జూన్ నెలలో 4.2 శాతానికి క్షీణించింది. ప్రధానంగా ఉత్పాదక కార్యకలాపాలలో వృద్ధి మందగించినట్లు అధికారిక వర్గాలు సోమవారం విడుదల చేసిన నివేదిక పేర్కొంది.మే నెలలో ఉత్పాదక వృద్ధి (ఐఐపిలో 78 శాతం వాటా కలిగిన) 5 శాతం ఉండగా, జూన్ నెలలో ఏడు నెలల కనిష్ట స్థాయి 2.6 శాతానికి క్షీణించింది. విద్యుత్ వృద్ధి 13.7 శాతం నుండి మూడు నెలల కనిష్ట స్థాయి 8.6 శాతానికి చేరింది. అయితే మైనింగ్ వృద్ధి మాత్రం ఎనిమిది నెలల గరిష్టానికి చేరింది. మే నెలలో 6.6 శాతం ఉండగా జూన్ నెలలో 10.3 శాతంగా నిలిచింది. దేశవ్యాప్తంగా జూన్ నెలలో అధిక వేడి పరిస్థితుల కారణంగా ఉత్పాదక వృద్ధి క్షీణించిందని, అయితే ఆటో వంటి కొన్ని రంగాలలో వస్తువుల జాబితాను క్రమబద్ధీకరించినట్లు ఆక్యూట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ చీఫ్ ఎకనామిస్ట్ సుమన్ చౌదరి తెలిపారు. మొదటి త్రైమాసికంలో పారిశ్రామిక ఉత్పత్తి తక్కువగా ఉండటంతో పాటు ఆశించిన లాభదాయకత కంటే తక్కువ కావడంతో ఉత్పాదక రంగంలో జివిఎ (కలిపిన స్థూల విలువ) వృద్ధి క్షీణించిందని చౌదరి పేర్కొన్నారు. దీంతో ఎఫ్‌వై25 మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధి 7 శాతం కన్నా తక్కువ ఉండవచ్చని అంచనావేశారు. అయితే ఏప్రిల్ -జూన్ త్రైమాసికంలో జిడిపి 7.1 శాతం మరియు మొత్తం ఎఫ్‌వై25 లో 7.2 శాతానికి వృద్ధి చెందుతుందని ఆర్‌బిఐ అంచనావేసింది. వినియోగ ఆధారిత కేటగిరీలో కన్జ్యూమర్ డ్యూరబుల్ అవుట్‌పుట్ వృద్ధి (వినియోగదారులు ఎక్కువ కాలం వాడే వస్తూత్పత్తి ఉదా :కారు, బంగారం, టివి ) జూన్‌లో ఆరు నెలల కనిష్టానికి 8.6 శాతానికి క్షీణించింది. అదే సమయం లో కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ వృద్ధి మే నెలలో 2.5 శాతం ఉండగా, జూన్ నాటికి మైనస్ 1.4 శాతానికి పడిపోయింది. ఉత్పాదకతలో తిరోగమనం గ్రామీణ రంగం నుండి బలమైన డిమాండ్ లేకపోవడాన్ని సూచిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పారిశ్రామిక కార్యకలాపాలకు విస్తృత ఆధారిత వినియోగ మెరుగుదల మరియు ప్రైవేట్ పెట్టుబడుల పునరుద్ధరణ చాలా కీలకమని కేర్ ఎడ్జ్ చీఫ్ ఎకనామిస్ట్ రజనీ సిన్హా తెలిపారు. వినియోగ దృష్టి కోణంలో ఆహార ద్రవ్యోల్బణ తీరు, రుతుపవనాల పురోగతి కీలకంగా ఉన్నాయని అన్నారు.




### మళ్లీ షాకిచ్చిన బంగారం ధరలు



మళ్లీ బంగారం ధరలకు రెక్కలొస్తున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు భారీగానే పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ తర్వాత ఒక్కసారిగి పడిపోయిన బంగారం ధరలు.. మళ్లీ క్రమంగా పుంజుకుంటున్నాయి. ఆగస్టు 13, 2024 మంగళవారం నాడు బంగారం ధర పెరిగింది. 24, 22 క్యారెట్ల బంగారం ధర 250 రూపాయలు పెరిగింది. దేశీయంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా,24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 వద్ద కొనసాగుతోంది. స్థానిక ఆభరణాల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడం, విదేశీ మార్కెట్ల జోరు పెరగడం వల్ల బంగారం ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,860 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,740 ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. కోల్‌కతాలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. కేరళలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.64,710 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.70,590 ఉంది. ఇదిలా ఉంటే బంగారం ధర పెరిగితే వెండి మాత్రం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. దేశీయంగా కిలో వెండి ధర రూ.82,400 ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రాం వెండి భారీగానే ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో 87,400 వద్ద ఉంది. హైదరాబాద్, చెన్నై, కేరళలో ఇదే ధర కొనసాగుతుండగా, అదే బెంగళూరులో కిలో వెండి రూ.78,900 వద్ద ఉంది.

### హిండెన్‌బర్గ్‌పై కఠిన చర్యలు తప్పవు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్‌తో కలిసి దేశం పరువును హిండెన్‌బర్గ్ తీసిందని యూనియన్ మినిస్టర్ గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు.ఈ కంపెనీపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదానీ షేర్లు కృత్రిమంగా పెంచిన ఆఫ్‌షోర్ ఫండ్స్‌లో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌కు, ఆమె భర్త దవళ్ బచ్‌కు వాటాలున్నాయని శనివారం హిండెన్‌బర్గ్ రిపోర్ట్ విడుదల చేసింది. ఈ ఆరోపణలు నిరాధారమని ఈ దంపతులు ఇప్పటికే క్లారిఫై చేశారు. తమ ఆర్థిక పరిస్థితి తెరిచిన పుస్తకమని అన్నారు.అదానీ గ్రూప్ కూడా హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమైనవని, పబ్లిక్‌ను మానిప్యులేట్ చేస్తోందని పేర్కొంది. గిరిరాజ్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్‌ను తీవ్రంగా విమర్శించారు. హిండెన్‌బర్గ్ వెనుక కాంగ్రెస్ ఉందని ఆరోపించారు. కాగా, మాధవి పురి బచ్ రాజీనామా చేయాలని ఆమెపై దర్యాప్తు జరిపేందుకు జేపీసీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు హిండెబర్గ్ లేటెస్ట్ రిపోర్ట్‌పై సెబీ, మాధవి పురి బచ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు యాడ్ చేయడానికి ఏం లేదని ఫైనాన్స్ మినిస్ట్రీ సెక్రెటరీ అజయ్ సేత్ పేర్కొన్నారు.

### యూనికామర్స్ అదుర్స్.. 118శాతం లాభంతో లిస్టింగ్




ముంబయి: యూనికామర్స్ ఇ-సొల్యూషన్స్ కంపెనీ లిస్టింగ్‌లో అదరగొట్టింది. మంగళవారం ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ. 108తో పోలిస్తే ఎన్ఎస్ఈలో షేరు ఏకంగా 117.59శాతం లాభంతో రూ. 235 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టింది. అటు బీఎస్ఈలో 112.96 శాతం ప్రీమియంతో రూ.230 వద్ద అరంగేట్రం చేసింది. గతవారం ముగిసిన ఈ ఐపీఓకి 168 రెట్ల స్పందన లభించింది. యూనికామర్స్ ఇ-సొల్యూషన్స్ ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.102- 108గా నిర్ణయించింది. ఐపీఓకు వచ్చిన కొన్ని గంటల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అయ్యింది. ఐపీఓ కోసం 1,40,84,681 షేర్లను అందుబాటులో ఉంచగా.. 2,37,11,72,994 బిడ్లు దాఖలయ్యాయి. సబ్‌స్క్రిప్షన్ ముగిసే సమయానికి నాన్ ఇన్‌స్టిట్యూషన్ ఇన్వెస్టర్లు 252.46 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్ బయ్యర్లు విభాగంలో 138.75 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 130.99 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. 2012లో యూనికామర్స్ ఇ-సొల్యూషన్స్ స్థాపించారు. ఇది భారత్‌లో లెన్స్‌కార్ట్, టీసీఎస్, మామాఎర్త్, ఇమామీ, సెల్లో వంటి ప్రముఖ కంపెనీలకు సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తోంది. ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, సీఎల్ఎస్ఏ ఇండియా ఈ సంస్థకు బుక్ రన్నింగ్ మేనేజర్లుగా ఉన్నాయి. వందల కంపెనీల పేర్లతో.. జీఎస్టీ అధికారిణి రూ. 54 కోట్ల రీఫండ్‌ను మేసి..! ఫస్ట్ క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీ సొల్యూషన్స్ కూడా మంగళవారం మార్కెట్లోకి వచ్చింది. దీని ఇష్యూ ధర రూ.465 కాగా.. ఎన్ఎస్ఈలో 40శాతం లాభంతో రూ.651తో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. బీఎస్ఈలో 34.41శాతం ప్రీమియంతో రూ.625 వద్ద లిస్ట్ అయ్యింది. ఈ ఐపీఓకు 12.22 రెట్ల స్పందన లభించింది. ఐపీఓ కోసం 4,96,39,004 షేర్లను అందుబాటులో ఉంచగా.. 60,64,29,472 బిడ్లు దాఖలయ్యాయి. రూ.4,194 కోట్ల విలువైన ఐపీఓలో రిటైల్ పోర్షన్‌లో 2.31 రెట్లు, ఎన్ఐఐ కేటగిరి 4.68 రెట్లు, క్యూఐబీ కోటాలో 19.30 రెట్లు దాఖలయ్యాయి.

### స్వల్ప నష్టాల్లో అదానీ షేర్లు




**న్యూఢిల్లీ :** హిండెన్ బర్గ్ తాజా నివేదికతో స్టాక్ మార్కెట్‌లో సోమవారం అదానీ షేర్లు పడిపోయాయి. అదానీ పవర్ షేర్ ధర రూ.698.45 ప్రారంభమై, గరిష్టంగా రూ.703.25 మరియు కనిష్టంగా రూ.692కి చేరి.. చివరగా రూ.691.05తో ముగిసింది. కంపెనీ మార్కెట్ పెట్టుబడులు రూ.268,095.83 కోట్ల వద్ద నిలిచింది. 52 వారాల స్టాక్ పరిధి రూ.896.75 మరియు రూ.264.75 మధ్య ఉంది. బిఎస్ఇలో మొత్తం 197,045 షేర్లు ట్రేడయ్యాయి. మధ్యాహ్నం 12.00 గంటల సమయానికి అదానీ పవర్ స్టాక్ ధర రూ.685.25 వద్ద 1.42 శాతం తగ్గింది. మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. అదానీ పవర్ షేర్ల స్వల్పకాలిక ట్రెండ్ నష్టాల్లో ఉండగా, దీర్ఘకాలిక ట్రెండ్ లాభాల్లో కొనసాగు తోంది. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ఈ ఉదయం బిఎస్ఇలో 17 శాతం నష్టపోగా, అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్‌డిటివి 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం చొప్పున నష్టపోయాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ ఎంటర్ ప్రైజెస్ 5.43 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్ 2.53 శాతం, ఎసిసి 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, ఆ తర్వాత కొద్దిమేర కోలుకున్నట్లు నిపుణులు తెలిపారు.

## వన్డేల్లో చెత్త రికార్డ్ నమోదు చేసిన భారత బ్యాటర్లు



భారత జట్టు ఇటీవల శ్రీలంక పర్యటనలో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడుతున్నట్లు కనిపించింది. దీంతో ఈ సిరీస్‌లో టీమిండియా 2-0 తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.ఇప్పుడు ఈ ఏడాది టీమ్ ఇండియా ఎలాంటి వన్డే మ్యాచ్ ఆడదు. అదే సమయంలో 2024లో వన్డే క్రికెట్‌లో భారత జట్టు బ్యాట్స్‌మెన్స్ పేలవ ప్రదర్శన కనిపించింది. దీంతో 38 ఏళ్ల రికార్డు కూడా బద్దలైంది.ఎందుకంటే ఈ ఏడాది వన్డే క్రికెట్‌లో ఏ భారత బ్యాట్స్‌మెన్ ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. చివరిసారిగా మహమ్మద్ అజారుద్దీన్ కెప్టెన్సీలో కనిపించింది. ఏడాదిలో ఏ భారత బ్యాట్స్‌మెన్ వన్డే మ్యాచ్‌లో సెంచరీ చేయలేకపోయాడు. ఈ ఏడాది వన్డేల్లో భారత బ్యాట్స్‌మెన్ ఎవరూ సెంచరీ చేయలేకపోయారు.. టీ20 క్రికెట్‌లో ఈ ఏడాది టీమిండియా ఆటతీరు అద్భుతంగా ఉంది. దీని కారణంగా రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత జట్టు 2024 టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. కానీ, వన్డే క్రికెట్‌లో భారత బ్యాట్స్‌మెన్ మెరుపు కనిపించలేదు. దీని కారణంగా 2024లో ఏ భారత బ్యాట్స్‌మెన్ వన్డే మ్యాచ్‌లో సెంచరీ చేయలేకపోయాడు. 38 ఏళ్ల తర్వాత ఈ ఏడాది వన్డే క్రికెట్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్ ఒక్క సెంచరీ కూడా చేయకపోవడం ఇదే తొలిసారి. ఇంతకు ముందు, ప్రతి సంవత్సరం ఏదో ఒక బ్యాట్స్‌మెన్ వన్డే మ్యాచ్‌లలో సెంచరీ చేయడం జరిగింది. 1985లో టీమ్ ఇండియాతో చివరిసారి ఇలా జరిగింది. 1985లో కూడా వన్డే క్రికెట్‌లో ఏ భారత బ్యాట్స్‌మెన్ కూడా సెంచరీ చేయలేకపోయాడు. 1985లో భారత జట్టు కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ అత్యధిక ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేశాడు. ఈసారి 2024లో వన్డే క్రికెట్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే మ్యాచ్‌లో అతిపెద్ద ఇన్నింగ్స్‌ను నమోదు చేశాడు. శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ 65 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఏడాది భారత బ్యాట్స్‌మెన్‌లో ఇదే అత్యధిక వన్డే ఇన్నింగ్స్. ఈ ఏడాది టీమ్ ఇండియా కేవలం టీ0, టెస్టు మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది.

# స్పోర్ట్స్

### వరల్డ్ కప్ ఫైనల్ బ్యాట్‌కు రిటైర్మెంట్



గతేడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ భారతీయులకు ఎంతో చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. ఆ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు చేరిన రోహిత్ సేన కచ్చితంగా టైటిల్ సాధిస్తుందని అభిమానులు ఆశించారు. అయితే ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియాను ఆస్ట్రేలియా నిలువరించింది. భారత్‌పై విజయం సాధించి కప్ ఎగరేసుకుపోయింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయానికి ట్రావిస్ హెడ్, మార్నస్ లబూసేన్ భాగస్వామ్యమే కారణం. ఆ మ్యాచ్‌లో 241 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. 47 పరుగులకే మూడు కీలక వికెట్లు పోగొట్టుకుంది. అయితే ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు మార్నస్ లబూషేన్ జత కలవడంతో మ్యాచ్ ఆస్ట్రేలియా వైపు టర్న్ అయింది. హెడ్ సెంచరీ చేయగా, లబూషేన్ 110 బంతుల్లో 58 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. ఆ ఫైనల్ మ్యాచ్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడడానికి తను ఉపయోగించిన బ్యాట్ తాజాగా దెబ్బతిందని లబూషేన్ సోషల్ మీడియా ద్వారా తెలిపాడు.దెబ్బతిన్న బ్యాట్ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఆ ఫొటోలోని బ్యాట్ పాక్షికంగా దెబ్బతింది. బ్యాటు అడుగు భాగంలోని పై పొర కొంత ఊడివచ్చింది. దాంతో ఆ బ్యాట్‌కు లబూషేన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆ బ్యాట్‌తో ఆడిన మొత్తం 10 ఇన్నింగ్స్‌ల్లో లబూషేన్ 40.22 సగటుతో 362 రన్స్ కొట్టాడు. లబూషేన్ పోస్ట్‌పై నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆ బ్యాట్‌ను తమ మ్యూజియంకు ఇవ్వాలని ఒకరు అడిగారు.

### వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ క్రికెట్..





ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. తాజాగా వెస్టిండీస్ – దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ముగిసిన తర్వాత పాయింట్లు పట్టిక ఎలా ఉంది ? ఫైనల్స్ రేసులో ఎవరెవరు ? ఉన్నారో చూద్దాం. వెస్టిండీస్ – దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్ట్ ముగియడంతో పాయింట్ల పట్టికలో పెద్దగా మార్పులు ఏమీ లేవు. వెస్టిండీస్ 9 వ స్థానంలో ఉంటే … దక్షిణాఫ్రికా ఏడవ స్థానంలో కొనసాగుతోంది. ఇక ఇప్పటివరకు 9 మ్యాచులు ఆడి ఆరు విజయాలు సాధించిన భారత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత రెండో స్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతోంది. ఇక ఆస్ట్రేలియా తర్వాత వరుసగా న్యూజిలాండ్ – శ్రీలంక – పాకిస్తాన్ – ఇంగ్లాండ్ – దక్షిణాఫ్రికా – బంగ్లాదేశ్ – వెస్టిండీస్ ఆ తర్వాత స్థానాలలో కొనసాగుతున్నాయి. ఇక ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం చూస్తే భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ క్రికెట్ ఫైనల్ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక ఫైనల్ రేసు లో భారత్ చాలా ముందు ఉందనే చెప్పాలి. ఎందుకంటే భారత్ ఇప్పటివరకు 9 మ్యాచులు ఆడి 68 పాయింట్లు సాధిస్తే … 12 మ్యాచ్‌లు ఆడిన ఆస్ట్రేలియా 62 పాయింట్లు సాధించింది. ఇక మూడో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ 50 పాయింట్లు సాధిస్తే … నాలుగో స్థానంలో ఉన్న శ్రీలంక సైతం 50 పాయింట్లు సాధించి పాయింట్లు పట్టికలో టాప్ ఫోర్ ప్లేస్లో కొనసాగుతుంది. మరి ఏమైనా అంచనాలు తలకిందులు అయితే తప్ప ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్ మ్యాచ్ భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఒకసారి న్యూజిలాండ్ చేతిలో మరోసారి ఆస్ట్రేలియా చేతిలో ఫైనల్ కి వెళ్లి ఓడిపోయిన భారత్ మరి ఈసారైనా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ కిరీటాన్ని సాధిస్తుందేమో చూడాలి.

### వినేశ్ విజయం సాధించేనా!



ఇండియా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు న్యాయం దక్కుతుందా? పారిస్ ఒలింపిక్స్‌లో ఆమెకు రజత పతకం ఇస్తారా?అనే సస్పెన్స్‌కు మంగళవారం తెరపడనుంది. వంద గ్రాముల అధిక బరువు కారణంగా తనపై వేసిన అనర్హత వేటును సవాల్ చేస్తూ వినేశ్ చేసిన అప్పీల్ విచారణ పూర్తి చేసిన కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) మరికొన్ని గంటల్లో తీర్పు వెలువరించనుంది. ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు విన్న కాస్ శనివారమే తీర్పు ఇవ్వాల్సింది. కానీ, విచారణను పూర్తి స్థాయిలో మరోసారి పరిశీలించేందుకు మరింత సమయం తీసుకుంది.విమెన్స్ 50 కేజీ కేటగిరీలో ఫైనల్ చేరిన వినేశ్ స్వర్ణ పతక పోరుకు ముందు నిర్వహించిన పరీక్షల్లో నిర్ణీత బరువు కంటే 100 గ్రాములు ఎక్కువ ఉండటంతో అనర్హత వేటుకు గురైంది. అయితే, పోటీల తొలి రోజు ఆమె బరువు నిర్ణీత పరిమితిలోపే ఉంది కాబట్టి ఇది మోసం కాదని, ఫైనల్ చేరినందుకు రజతం ఇవ్వాలని వినేశ్ న్యాయవాదులు కాస్‌కు నివేదించారు. వినేశ్ బరువు పెరిగి పతకం కోల్పోయిన విషయంలో తమ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్ధివాలాపై వస్తున్న విమర్శలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఐఓఏ ప్రెసిడెంట్ పీటీ ఉష ఖండించారు. రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో వంటి ఆటల్లో వెయిట్ మేనేజ్‌మెంట్ బాధ్యత అథ్లెట్లు, వారి కోచ్‌లదేనని స్పష్టం చేశారు. దీనికి ఐఓఏ నియమించిన చీఫ్ మెడికల్ ఆఫీసర్, అతని బృందానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వినేశ్ అంశం తీవ్రంగా బాధించిందన్న ఉష.. దీనికి తమ మెడికల్ టీమ్‌పై విమర్శలు చేయడం సరైంది కాదన్నారు.






# 'డాన్' షారుక్ కాదు హృతిక్

'డాన్'.. ఈ పేరు వింటేనే సినీప్రియుల మదిలో మెదిలే కథానాయకులు అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్. 'డాన్', 'డాన్ 2' సినిమాలు షారుక్‌ని తెరపై మరింత స్టైలిష్‌గా ఆవిష్కరించాయి.కానీ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించిన ఈ చిత్రాల్లో హృతిక్ రోషన్ పోషించాల్సిన 'డాన్' పాత్రలో షారుక్ నటించారంటే నమ్ముతారా..? అవును.. ఇది నిజమే అంటున్నారు దర్శకుడు ఫర్హాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన..హృతిక్‌తో 'డాన్' చిత్రం గురించి చర్చించిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. "లక్ష్య'లో హృతిక్‌తో కలిసి పనిచేసినప్పుడు ఆయన నటనకు ఫిదా అయిపోయాను. దీంతో అమితాబ్ నటించిన 'డాన్'ను రీమేక్ చేయాలనే ఆలోచనను మొదటగా హృతిక్‌తోనే చెప్పాను. వెంటనే ఇది అద్భుతంగా ఉందని.. స్క్రిప్ట్ సిద్ధం చేయమని చెప్పాడు. కానీ.. కథ రాసేటప్పుడు షారుక్ వ్యక్తిత్వం గుర్తొచ్చి ఈ పాత్రకు ఆయన మాత్రమే సరిగ్గా సరిపోతాడనిపించింది. ఈ విషయాన్ని హృతిక్‌తో పంచుకుంటే..'మీరు మీ సినిమాల్ని అందరికంటే ఉత్తమంగా..ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా తీర్చిదిద్దాలనుకుంటారు. 'డాన్' పాత్రను కచ్చితంగా షారుక్ మాత్రమే చేయగలడనిపిస్తే ఆయనతోనే దీన్ని తెరకెక్కించండి. నా గురించి ఆలోచించకండ'ని చెప్పాడు. కానీ ఈ ప్రాజెక్టుకు మొదటి డాన్ హృతిక్ మాత్రమే" అని ఆనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు దర్శకుడు. ప్రస్తుతం ఈయన రణ్‌వీర్ సింగ్‌తో కలిసి 'డాన్ 3'ని రూపొందించే పనిలో ఉన్నారు.

# అవకాశాలు అంత సులువుగా రాలే


ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అగ్ర కథానాయికగా చలామణి అవుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. తెలుగు, హిందీ భాషల్లో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, కెరీర్ తొలినాళ్లలో అవకాశాలు అంత సులభంగా రాలేదని చెప్పింది రష్మిక. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాటి కష్టాల గురించి చెప్పుకొచ్చిందీ భామ. ఆమె మాట్లాడుతూ 'ఆడిషన్స్‌కు వెళ్లిన ప్రతీసారి తిరస్కారాలు ఎదురయ్యేవి. కొందరైతే నేను నటిగా సక్సెస్ కావడం చాలా కష్టమని మాట్లాడేవారు. అవకాశాలు రావనే దిగులుతో కన్నీళ్లతో ఇంటికి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఓ సినిమా సెలెక్ట్ చేసిన తర్వాత మూడు నెలల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను క్యాన్సిల్ చేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా.. ఎప్పుడూ సినీరంగం నుంచి తప్పుకోవాలనుకోలేదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, నటిగా ప్రతీ సినిమాకు ప్రతిభను మెరుగుపరచుకుంటూ ఈ స్థాయికి వచ్చా' అని చెప్పింది. ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో 'పుష్ప-2' తో పాటు మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నది.



## పూరీ-రామ్ మాస్ బరాత్ షురూ అయింది రో..

# డబుల్ ఇస్మార్ట్ బుకింగ్స్ టైం

టాలీవుడ్ యాక్టర్ రామ్ పోతినేని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా డబుల్ ఇస్మార్ట్ పూరీజగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలవుతోంది. మరో రెండు రోజుల్లో థియేటర్లలో సందడి చేయనున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. తాజాగా సినీ జనాలు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న అప్‌డేట్ రానే వచ్చింది. మూవీ టికెట్స్ బుకింగ్స్ చేసుకునే టైం వచ్చేసింది. డబుల్ ధిమాకోడి మాస్ బరాత్ షురూ అయింది రో.. డబుల్ ఇస్మార్ట్ బుకింగ్స్ మొదలయ్యాయి. మీ టికెట్స్ బుక్ చేసుకొని.. పండగ చేస్కోండి.. అంటూ మేకర్స్ అదిరిపోయే వార్తను మూవీ లవర్స్‌తో షేర్ చేసుకున్నారు. ఇంకేంటి మరి డబుల్ ఇస్మార్ట్ టికెట్స్ బుక్ చేసుకోండి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఆసక్తికర అప్‌డేట్ ఒకటి షేర్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని నైజాంలో ప్రైమ్ షో ఫిలిమ్స్ విడుదల చేస్తుండగా.. తమిళనాడులో పాపులర్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీ శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేస్తోంది. ఇప్పటికే ధిమాక్కిరికిరి డబుల్ ఇస్మార్ట్ టీజర్, ట్రైలర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది.



# నాని హంగామా షురూ..

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. గ్యాంగ్‌లీడర్ ఫేం ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 29న విడుదల చేస్తున్నారు. కాగా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఇవాళ సాయత్రం 5 గంటల నుంచి ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. కాగా ట్రైలర్ టైంను గుర్తు చేస్తూ నాని హంగామా షురూ అంటూ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్స్‌లో నయా లుక్ ఒకటి షేర్ చేసింది. ఈ లుక్ చూసిన అభిమానులు ట్రైలర్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని తెగ ఎదురుచూస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఆఫీసులో నాని.. డ్యూటీ (కానిస్టేబుల్)లో ప్రియాంకా మోహన్ చాట్‌లో ఉన్న స్టిల్స్ షేర్ చేశారని తెలిసిందే. సూర్య : హాయ్ స్క్విటీ పెప్ అని మెసేజ్ పెడితే.. చారు : హాయ్ బాటిల్ క్యాప్ అని రిప్లై ఇచ్చింది. సూర్య 4:05 ? అని పెట్టగా.. చారు 4:05 ఒకే అంటూ రిప్లై ఇచ్చింది. ఈ ఇద్దరూ సాయంత్రం కలిసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారని చాట్‌తో అర్థమవుతోంది. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీ ఇతర భాషల్లో రిలీజ్ కానుంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918